నవల

# రెండు ప్రశ్నలు

డా॥ చందు సుబ్బారావు



## 'మనిషికేం కావాలి' అని ఓ పదిలక్షల డాలర్ల ప్రశ్న వేశాడో చేయి తిరిగిన రచయిత.

'మీరు చెప్పండి ఏం కావాలో' అంది సరోజ భాస్కరం ఎదురుగా కూర్చుని.

భాస్కరానికి సమాధానం చెప్పే ఓపిక లేదు. చెప్పినా సరోజ ఒప్పుకోదు.

'డబ్బా' మళ్ళీ అడిగింది తనే.

'అబ్బే కాదు.' భాస్కరం ఇహ చెప్పక తప్పదన్నట్లు.

'కీర్తా'

'అనవసరం అజీర్తి కూడాను' భాస్కరం వెటకారంగా.

'సంసారమా'

'అమ్మో! అందులో పెళ్ళాముంటుంది'

'మరి పిల్లలా!'

'వేధించుకు తింటారు.'

'మరేమిటి?' రెట్టించింది.



'నేను చెప్పను' భాస్కరం!

'చెబితే చంపుతావేమిటి?'

'నువ్వు చంపుతావనే భావన చాలు. నేనీ జన్మలో మాట్లాడకపోవటానికి.'

'మీరేం చెబుతారో నాకు తెలుసులెండి.'

'నీకన్ని విషయాలూ ఇట్టే తెలుస్తాయన్నమాట.'

'హుం మీ సమాధానం నాకు నచ్చదు.'

'నేనింకా సమాధానం చెప్పలేదు.'

'మీరు చెప్పేదేమిటి? మీ అణువణువునా అది జీర్ణించుకుపోయింది. మీకది తప్ప ఇంకో ఆలోచనే రాదు.'

'మంచిది.'

'మంచి మాటంటూ మీ తలపుల్లోనే వుండదూ.'

'నీకు ఆరో ఇంద్రియ జ్ఞానం కూడా ఉందే.'

'ఉండాలేమిటీ- మిమ్మల్ని చూస్తేనే తెలుస్తుంది.'

'ఎలా కనిపిస్తున్నాను?'

ఆ చూపులూ! ఆ చేతలూ; ఆ రాతలూ! ఏం చెబుతున్నాయని అడగలేదు భాస్కరం. పదహారొందల దెబ్భయ్యో సారి ఇద్దరికీ ఇలా ఘర్షణయ్యింది.

'అవును. ఓ విషయం చెప్పండి'- మళ్ళీ మొదలెట్టింది సరోజ. మగవాణ్ని 'సయనైడ్' కంటే తేలిగ్గా ఎలా చూపాలో ఆడవాళ్ళకు మాత్రమే తెల్సు. సరోజ అచ్చమైన ఆడపిల్ల.

'చెప్పనన్నానుగా' భాస్కరం.

'చెప్పేదేమిటిలే తెలుస్తూనే వుంది.'

'చూడు సరోజా నీకన్నీ తెలిశాయిగదా, హాయిగా అన్నం పెట్టకూడదూ భోం చేస్తాను.'

'పెడతాన్లే భోజనం- మీ కిష్టమైన పచ్చడేగదా.'

'ఏమిటది?' ఆసక్తిగా భాస్కరం.

'పొట్లకాయ పెరుగు పచ్చడి.'

'అవును. నాకు చాలా యిష్టం.'

'నాకిష్టం లేదు.'

'పోనీ ఆవకాయ వేసుకుని తిను.'

'అది మీరేం చెప్పక్కర్లేదు'

భాస్కరం జుట్టు సర్దుకున్నాడు. సరోజ ప్రభావంవల్ల ఊడిపోయిన జుట్టెంతో చూసుకోటానికి!

'ఇంకా చెప్పండి మీకేమిటిష్టమో?'

ఆడది శక్తి! అప్పుడప్పుడెదురు తిరిగితేనే తప్ప లేకుంటే విజృంభించిపోతుంది. ఇక లాభం లేదని.

'పాత సినిమాలంటే యిష్టం' అన్నాడు భాస్కరం.

'నాకిష్టం లేదు.'

'అదేమిటి? నా యిష్టాల లిస్టు చెప్పమన్నావుగాని. నీ ప్రతి లిస్టు నేనడగలేదే!' భాస్కరం.

'సర్లే చెప్పండి' సరోజ.

'పల్లెటూరంటే యిష్టం' భాస్కరం.

'నాకిష్టం లేదు. వెధవది కరెంటే నుండదు.'

'సింప్లిసిటీ అంటే యిష్టం.'

'నువ్వు పేదవాడివే గనుక.'

'కవులంటే యిష్టం.'

'నాకు నచ్చదు. కవులంతా వెకిలివాళ్ళు. నూటికి తొంభై మంది పెళ్ళాల్ని వదిలేస్తారు.'

'కమ్యూనిస్టులంటే యిష్టం.'

'ఐ లైక్ ఇందిరా గాంధీ. ఓన్లీ-'

'ఆడవాళ్ళు బొద్దుగా వుండాలి.'

'అక్కర్లేదు. సన్నగా వుండాలి.'

'ఆనపకాయ పులుసు బావుంటుంది.'

'కారెట్ ఫ్రయ్ అంతకంటే బావుంటుంది.'

'ఇడ్లీ సాంబారు.'

'చపాతీ కూర్మా.'

'యద్దనపూడి నవలలంటే నాకు గిట్టదు.'

'నాకు గిడుతుంది.'

'అందరికీ ఆదర్శంగా వుండాలి.'

'అక్కర్లేదు. పెళ్లాం పిల్లల్ని ఉద్ధరించాలి.'


ఆగిపోయింది బండి.

భాస్కరానికి పెళ్ళాన్ని గొంతునులిమేయాలనిపించింది. లాభంలేదు వెధవ ప్రపంచంలో బతకడమే కష్టం. సంపాయించటం ఇంకా కష్టం. నల్గురిలో పేరు తెచ్చుకుని రాణించటం మహా ప్రళయం.

ఈ స్త్రీ హత్యా పాతకం కూడా ఎందుకు? పాపాలూ పుణ్యాలూ వదిలేసినా గొప్ప రిస్కు.

పెళ్ళాన్ని చంపిన వాడంటే ఓ పట్టాన పిల్లనివ్వరు. మనస్సుకు శాంతుండదు. బంధువర్గం ఆడిపోసుకుంటుంది. స్నేహితులంతా చులకనగా చూస్తారు.

అసలింతా చేస్తే కోర్టువారు యావజ్జీవ కారాగార శిక్ష వెయ్యకుండా వదుల్తారనే గ్యారంటీ లేదు.



ఇంచక్కా నవ్వుతూ, నమస్కారాలు పెడుతూ పలకరించాల్సిన లోకం 'వెధవ మర్డర్ ముండాకొడుకు' అన్నట్లు చూస్తే సహించలేడు.

అంతకంటే ఈ పెళ్ళాంతో వేగటంసులభమనిఎప్పుడో నిర్ణయించుకున్నాడు భాస్కరం.

రాగాపోగా సరోజ ఉద్యోగం చేస్తుంది. ఆరొందలు తెస్తుంది. ఇంచక్కా సినిమా ఖర్చులన్నీ తనే భరిస్తుంది.

అందమంటారూ అంతగా తీసివేయల్సింది కాదు.

సినిమా తారలంతా అందంగా ఏడ్చారూ. హేమమాలినికి నేతచీర కట్టి. నల్లపూసల పుస్తె మెళ్ళో వేసి. నాల్రోజులు జుట్టుకు నూనె మానేసి. ఓ పూట వంట చేయించి పొడుగు ముఖం మేకప్ మేనుల్తో కవరు చేయించకుండా రమ్మనమనండి బయటకు.

ధర్మేంద్ర కాదు సరికదా గుమస్తా ధర్మారావు కూడా కన్నెత్తి చూడదు!

సరోజలో మూర్తీభవించిన బూర్జువాసంస్కారంఉందని పిస్తుంది భాస్కరానికి.

సరోజను కాకుండా ఇంకో ఉరోజను చేసుకున్నాఆమెకు గొప్ప శ్రామిక జన సంస్కృతి అబ్బేదన్న గ్యారంటీ లేదు గదా.


'ఏ మగాడు ఏ ఆడదానితోనైనా కాపరం చేయగలడు' అంటూ లక్షన్నర రూపాయల ముక్క చెప్పాడు కొడవటిగంటి!

ఈ వాక్యం భాస్కరానికి బాగా నచ్చుతుంది. పైగా భాస్కరం థీరీ ప్రకారమైనా 'ఈ ప్రపంచంలో ఏదీ సంపూర్ణ స్థితిలో లేదు. అన్నీ సాపేక్ష స్థితిలోనే వున్నాయి అంచేతబాధపడాల్సిందేమీ లేదు'

ప్రకాష్‌గాడి పెళ్ళాం మూడ్రోజులకోసారి అలిగి సముద్రం వొడ్డుకు పోయి ఐస్‌క్రీం తినొస్తుంటుంది. సముద్రంలో దూకుతుందేమోనని వీడు హైరానపడిపోతాడు.

సుందరంగాడి సతీమణి వయ్యారాల కొయ్య వీడి జీతం ఆవిడ చీరెలకూ, సింగారాలకూ అయిదు రోజులొస్తుంది. ఆరో రోజు లిప్‌స్టిక్ వేసుకున్న పెదాల్తో పక్కింట్లో పంచదారఅప్పడుగుతుంది. శాస్త్రి భాస్కరం ఆఫీసులోనే పనిచేస్తున్నాడు. ఆయన అర్ధాంగి పాపం మహాతల్లి. చీరె కట్టుకున్నాననుకుని లంగాతోనే పేరంటానికి పోతుంది. ఆ ఆఫీసులోనే మరో గుమాస్తా గుర్నాథం. భాస్కరానికి వాడంటే ఒళ్ళు మంట. వెధవ రోలింగ్ బండలా వుంటాడు. వాడి పెళ్ళాం 'కాలింగ్ గరల్'లా కనిపిస్తుంది వచ్చినవాళ్ళ ఒంటిమీద కాఫీపోపి కావాలని తుడుస్తుంటుంది. ఈ రోలింగ్‌బండ సిగ్గులేకుండా 'ఇక్కడ తుడువ్ అక్కడ తుడువ్' అంటుంటాడు. సుబ్బరంగా- ఆఫీసుద్యోగం మానేసి వీడు ప్రొప్రయిటర్‌గా వాళ్ళావిడతో బిజినెస్ పెట్టుకోవచ్చుగా.

వెంకట్రావు.... అఫ్‌కోర్స్ వెంకట్రావు బెటర్ హాఫ్ మాత్రం బెటర్ హాఫ్ లానే వుంటుంది కన్నెత్తి చూస్తే మగాళ్ళకు కలలొస్తాయి. సదరు వెంకట్రావు భాస్కరం ఉండే మేడ క్రింది వాటాలోనే వుంటున్నాడు. మర్కెంటైల్ బ్యాంక్‌లో



కేషియర్. భార్య ఇందిరను చూసుకుంటూ ఇరవై అర గంటలు గడిపేయగలడు. 'ఇతడు మరో అమ్మాయిని కన్నెత్తి చూస్తాడా' అని భాస్కరానికి అనుమానం.

ఇందిర మినహాయిస్తే పై పెళ్ళాల్తో పోల్చిచూసినప్పుడు భాస్కరానికి తన పెళ్ళాం సుందర సరోజం.వేయి రేట్లు మెరుగనిపిస్తుంది.

అల్లా! 'అ ప్రజాస్వామ్య హక్కుల దగ్గరే' అమెరికా, రష్యాలకు భిన్నాభిప్రాయాలున్నట్లు భాస్కరం, సరోజా కలవరుగాక కలవరు.

## 2

భాస్కరం ఆఫీసులో పని చేసే జ్యోతి అపురూపవతి గుడ్డూ కాదుకాని మగవాళ్ళందరికీ యించక్కా నచ్చుతుంది. జ్యోతికి పెళ్ళయిందో.లేదో ఎవ్వరికీ తెలియదు. పెళ్ళయిందంటారు కొందరు. విడాకులిచ్చిందంటారు కొందరు.

పెళ్ళి కాకుండానే విడాకులిచ్చిందంటారు మరికొందరు. ఏమైతేనేం జ్యోతి హాయిగా నవ్వుతుంది. పువ్వులా తిరుగుతుంది. భాస్కరానికి అధికారం ఉందొచ్చుకాని ఆమె దగ్గర మరో 'ధిక్కారం' ఉంది. దాని ముందు భాస్కరం పవరు ఎందుకూ కొరగాదు.

భాస్కరానికి జ్యోతి సబార్డినేటు ! తెలివి, ఉద్యోగం, డబ్బూ అన్నిట్లోనూ భాస్కరాన్ని తను మించిపోయిందేంలేదు.

అందంలో అయినా భాస్కరం ధర్మేంద్రలా వుండకపోవచ్చు కాని, కనీసం శశికపూర్‌లా అయినా వుంటాడు.

భాస్కరం మేడమీద చల్లగాల్లో కూర్చుని అందమైన ఊహల్ని నెమరువేసుకుంటున్నాడు. బ్యాంక్ వెంకట్రావు బుద్ధిగా ప్రక్కన కూర్చున్నాడు.

"వెంకట్రావుగారూ, మా ఆఫీసులో పనిచేసే జ్యోతిని చూశారా?"

"చూశానండి.మొన్న బ్యాంక్ కొచ్చింది "

"ఆవిడ నాకంటే బావుంటుందా?"

"ఏం, ప్రేమిస్తున్నారేమిటి?" .... వెంకట్రావు.

"అ - ప్రేమేమిటి నాన్సెన్స్ - నాకేంపన్లేదేమిటి?"

"పనులున్నా మధ్యలో ప్రేమించొచ్చుగా." వెంకట్రావు తన లిమిటెడ్ తెలివితోనే చక్కగా అన్నాడు.

"....అవుననుకోండి....ఆడకి, మగకి ప్రేమే ఉండాలేమిటి?"

"అంటే మీ ఉద్దేశ్యం 'అదే' వుండాలనా?"

భాస్కరం ఇబ్బందిలోపడ్డాడు.

సిద్ధాంతరీత్యా తన కాలనీలో ఉత్తమ మేధావిగా, రచయితగా చలామణి అవుతున్న భాస్కరం కనీసం ఓ వారపత్రిక ముఖమైనా సరిగ్గాచూడని వెంకట్రావు ప్రశ్నకు చిక్కిపోవటం దారుణమనిపించింది.

మనసులోని అజ్ఞాత కోర్కెలు కలలుగా వచ్చినట్లే, అజ్ఞానవాంఛ లిలాగే పెదవుల్నుండి స్లిప్పయిపోతుంటాయి.... ఇంకా నయం....వెంకట్రావు కాబట్టి సరిపోయింది. మరొకడయితే.... ఈ సంగతి అలా అలా చేతులు మారి సరోజకు చేరిపోయి నిప్పంటుకున్న....!

"మాట్లాడరేం" వెంకట్రావు !

ఈ వెంకట్రావుకు జీవితంలో అందాలూ, ఆనందాలూ ఏవీ పట్టవా ...భార్య సుందరంగా ఉన్నంతమాత్రాన అంత జడత్వం వస్తుందా.... ఒకవేళవస్తే అది అలాగే నిలుస్తుందా.... కాలంతోపాటు మారుతుందా....ఇలాంటివాళ్ళు గుడ్డా, బేడా, ఇండిపరెంటా....తేలలేదు భాస్కరానికి.

సరోజకు వెంకట్రావంటే ఎక్కడ్లేని గౌరవం .... ఆరాధనా....వగైరాలు !

"మగాళ్ళు అలా వుండాలంటుంది...."

"అందరూ అలా ఎలా ఉంటారు....కొందరు ఇంజనీర్లుంటారు....కొందరు డాక్టర్లుంటారు .... డాక్టరుగారు స్త్రీ రోగుల్ని ముట్టుకుని పరీక్ష చేస్తారు. అలాగని ఇంజనీరుగారు స్త్రీ కూలీల్ని పట్టుకుని నడిపిస్తే పూరుకుంటారా?" భాస్కరం!

సరోజకు చిరాకెక్కిపోతుంది.

"మీరావల్లెటూళ్ళో పెరిగి ఇలా పాడయిపోయారు .... టౌన్స్‌లో ఇలాంటి ఆలోచనలుకూడా మాకు రావు. శుభ్రంగా ఆ కంట్రాక్టరు కొడుకు మధుసూదనాన్ని పెళ్ళి చేసుకున్నాపోయేది" అంటుంది.

భాస్కరం చిరునవ్వుతో సరోజను పోయి వంకాయ పచ్చడి చేసుకోమన్నట్లు సైగచేస్తాడు....

బోరు భరించలేక మళ్ళీ కదిలించాడు వెంకట్రావు.


"అలా స్తంభించిపోయారేమిటీ.... ఏమిటో ఇటీవల తరచు ఆ అమ్మాయి పేరెత్తి ఇలా అయిపోతున్నారు...." వ్యంగ్యంగా అన్నాడు వెంకట్రావు....ఆడ విషయాలైతేచాలు అయోమయంగాళ్ళకూడా అలా వ్యంగ్యం పుట్టుకొస్తుంది.

చిరునవ్వు నవ్వి, కుర్చీలో సర్దుకూచుని,

"ఎలా అయిపోతున్నాను" భాస్కరం అడిగాడు.

"అదేనండి....మౌనంగా కూర్చోటం....ఎప్పుడో ఒక మాట మాట్లాడటం....అలా"

భాస్కరానికేదో గుర్తుకొచ్చినట్లు—



"మై డియర్ వెంకట్రావ్. జ్యోతిని చూస్తే మీకేమనిపించిందో నిజం చెప్పండి...."

"ఏ విషయంలో?"

"చాలా గ్రేస్‌ఫుల్‌గా ఉంటుందికదూ?"

"ఉంటుంది."

"సెక్సీగా ఉంటుందికదూ...."

"అవుననుకుంటానండి."

"తనంగీకరిస్తే మీరేంచేస్తారు"

"ఆ విషయం చెప్పటం కష్టం" మొహమాటపడ్డాడు.

"అంటే."

"నా సంగతి చెప్పలేనుకానండి....మగవాడయినవాడు లొంగిపోతాడండి...."

"మీ సిద్ధాంతంకాదు నేనడుగుత-అది నా బుర్రలో బీరువాలకొద్దీ వుంది. మీరయితే, 'ఛా 'నంటారా- హా శ్రీహరీ అంటారా?"

"హిహిహి" అని నవ్వాడు వెంకట్రావు.

అమ్మ దొంగవెధవ! అనుకున్నాడు భాస్కరం. అంతరంగం కనిపెట్టే యంత్రముంటే అందరిగుట్లూ ఇలా బయటపడతాయికాబోలు. లేకపోతే అందరూ పవిత్రులే....పతివ్రతలే. అలాంటి యంత్రాన్ని వెంటనే ఏట్లోపారేసి, కనిపెట్టిన వాణ్ణి తలో రాయేసి చంపేస్తారు కామోసు...."

భాస్కరానికి చటుక్కున మరో విషయం గుర్తొచ్చింది.

"అన్నట్లు వెంకట్రావుగారూ—మనదినవారీ చర్చలన్నీ మీ ఆవిడకు చెప్పేయడంలేదుకదా"ఆదుర్దాగా అడిగాడు.

"చెప్పనండి.చెబితే మనిద్దరిమీద బేడ్ ఇంప్రెషన్ పడిపోదూ."

Bad impression !

వెంకట్రావు భార్య చిరంజీవి సౌభాగ్యవతి ఇందిరాదేవి ఎనిమిదో తరగతి ఎగ్గొట్టేసింది.

వెంకట్రావు B. Com. పాసయ్యాడు.!

భాస్కరం M.A. పాసయ్యాడు.!

ఏ బాంక్ చోరీలోనో, బ్రోతల్ రైడ్‌లోనో, మర్డర్ కేసులోనో దొరికిపోలేదు.

స్నేహితులుగా ప్రయివేటుగా మేడమీద కూర్చుని ఏదో సుప్త భుజంగాలను లేవగొట్టుకుంటే ఆమెకు ఇంప్రెషన్ పోతుందా.. పోతే ఏమో-

దాందేముందిలే పొద్దుగూకిం తర్వాత ఎవడి బాధలు వాడికుంటాయ్.

సరోజ ఇద్దరికీ కాఫీ తెచ్చిచ్చింది.

## 3

భాస్కరం అడపాదడపా కథలు రాస్తుంటాడు.

"ఈ సమాజంలో ప్రతివ్యక్తికీ అన్నంకంటే అవసరమైన దొకటుంది. అన్నం కోసం నానా అగచాట్లు పడ్డట్టే, అబద్ధాలాడినట్టే, అష్టకష్టాలూ భరించినట్టే "దావి" కోసం కూడా ప్రతిమనిషీ తాపత్రయపడతాడు.

ఓ విధంగా ఆకలికంటే బాధాకరమైంది. ఉత్కృష్టమైంది. ఆహ్లాదకరమైంది అవసరమైంది. అదే ప్రాణం, అదే భాగ్యం. అదే సర్వస్వం. అది ప్రకృతి.అది పురుషుడు. అది జగత్తు. అది మిథ్యకాదు. అది మాయకాదు. అది మత్తుకాదు. అది మదం కాదు.జీవరాశి యావత్తూ అనుభవించే ప్రమోదం.

అది సృష్టి.అది జీవసృష్టి ప్రాణికుండే నిత్యనిరుపమానమైన దృష్టి! అది శృంగారం అది సెక్స్— సెక్స్—సెక్స్."

స్థూలంగా ఇదీ భాస్కరం కథల్లో ఇతివృత్తం!

ఈ కాలంలోనైనా, ఏకాలంలోనైనా శృంగారానికి నీతులూ, పరిమితులూ విధిస్తూనే వున్నారు. Rule is only to be violated. (అతిక్రమించటానికే నియమం) అని సామెత. ఆ నియమాల్ని తుణ్ణంగా త్రోసిరాజంటూనే వున్నారు. శుభ్రంగా బ్రతుకుతున్నారు.

'నీతి'ని ఆహారంలా తింటున్నారు. 'అవినీతి'ని పానీయంలా త్రాగుతున్నారు. తేలిగ్గా రెండూ జీర్ణమైపోతున్నాయి. తెంగెందుకు.. అవినీతి అని కొత్త పేరెందుకు? అదోనీతి మరో నీతి అంటే పోలా.

భాస్కరానికిభార్యసరోజ అందగానే కనిపిస్తుంది. స్నేహితుడి భార్య ఇందిర అంతఅందంగానూ కనిపిస్తుంది.కనిపించకపోతే కళ్ళకు లోపం అనరూ....

పనిపిల్ల సుబ్బులు వీళ్ళద్దరికంటే బావుంటుంది. "మరో జన్మ ఎత్తితే సుబ్బుల్ని పెళ్ళాడతానన్నాడు" ఓసారి సరదాగా భాస్కరం.

"తక్షణంసుబ్బుల్ని పనిలోనుంచిమానిపిస్తా"నందిసరోజ!

"అమ్మమ్మమ్మా అంతపని చేయ"కని బ్రతిమాలుకున్నాడు.

పునర్జన్మమీద తనకు విశ్వాసం లేదని, సైంటిస్టులుకూడా నమ్మటంలేదని సరోజకు లక్ష సంజాయిషీలు చెప్పుకున్నాడు.

తన కథ పడినప్పుడల్లా ఆఫీసులో భాస్కరానికి అభినందన సభ జరుగుతుంది.



అంతా కథ "బావుంది" అంటారు.

బారసాలకొచ్చి పిల్లవాడు బాగోలేదని అనే వాడెవరు?

రోలింగ్ గుర్నాధం పనిగట్టుకుని వాడి భార్య "కథ ఎంత బావుందన్నదో - ఎలా అన్నదో - ఏ డ్రస్ వేసుకుని అన్నదో-అనేటప్పుడు పడుకుందో, నుంచుందో" వర్ణిస్తాడు, ఇంతాచేస్తే వాడికి కథమాత్రం గుర్తుండదు ....!

అసలాకథ తన భార్యమీదే నంటాడు.

జ్యోతీ. భాస్కరం ముఖాలు చిట్లిస్తారు.

"తిరుగుబోతు ఆడదానిమీద కథ తన భార్యదే" అనే కంటే ఆ పిల్లను రోడ్డుమీద నిలబెట్టకూడదూ అనిపిస్తుంది జ్యోతికి

ఒక్క శాస్త్రిమాత్రం "కొంచెం సెక్సీగా వుందండీ ఇతివృత్తం" అంటాడు పళ్ళు నములుతూ. అలా ఉండకుండా ఉంటే బావుండేదన్నట్లు.

"శోభనం సీను సెక్సీగా వుండక "లస్సీ"లా ఉంటుందేమిటీ...." జ్యోతి వెక్కిరిస్తుంది.

"అయ్యో, జ్యోతీ నా భావం నీవు గ్రహించలేదు .... ఆ సన్నివేశాన్ని గూర్చికాదు నేనంట- ఆ కథానాయిక వర్ణన-గ్రటా మాత్రమే.... మే."

"చాల్లెద్దురూ మీరు లేరు సెక్సీగా...."జ్యోతి భాస్కరం వేపుకు తిరిగి.

"చాలా బావుందండి కథ... అలాంటి పెద్దమనుషులు ఎక్కడైనా వున్నారు. ఉదాహరణకు ఆ కరణంగారు అదే ఆ శాస్త్రిగారు." శాస్త్రివంక కొంటెగా....చూస్తూ.శాస్త్రి ఉలిక్కిపడి

"అయ్యో ఆ వెధవపేరు శర్మ తల్లీ.విడ్డూరంగా మార్చేయకు."

జ్యోతి ఫక్కున నవ్వుతుంది!

భాస్కరానికి కథావస్తువు దొరుకుతుంది! నిజమైన సన్మానం ఆ క్షణంలోనే జరుగుతుంది.జ్యోతి తన సమీక్ష కొనసాగిస్తూ.

పోనీ శర్మ- ఆ శర్మ ఆడపిల్లల్ని బస్సుల్లోనూ.మార్కెట్లలోనూ కాళ్ళు తొక్కుతుంటాడు అని రాశారు.... తప్పా నా కాలెంతమంది తొక్కటంలేదు. అరవయ్యేళ్ళవాళ్ళు పదహారేళ్ళ వాళ్ళు అంతా ఒకే పని చేయటంలా?"

"వాళ్ళు వేరు" శాస్త్రి ఏదో అనబోయాడు.

"వేరూలేదు,చెట్టూలేదు.మీరు మొన్న బస్సులోనాకాలు."

"ఆపినీఅఘాయిత్యం కూల అవతల ఆయనున్నారన్నదిలేకుండా అవాకులు.... మరీను."

సన్మానసభనుండి వాకౌట్ చేస్తాడు శాస్త్రి. తర్వాత ఒక్కొక్కరూ నిష్క్రమిస్తారు,జ్యోతిఇంకేం చెబుతుందోననుకుని!

భాస్కరం జ్యోతి మిగుల్తారు.!

ఓసారి కథపడినప్పుడు జ్యోతితో భాస్కరం? జ్యోతీ, ఆఫీసులో అందరికళ్ళూ నీ మీదేనా" అన్నాడు.

"కళ్ళయితే పర్వాలేదు." అంది జ్యోతి అసలువిషయం చెప్పనా. వద్దా అన్నట్లు.

"మరేం చేశారేమిటి?" కళ్ళుదించి చేయవలసినవన్నీను అంది జ్యోతి. దించిన కళ్ళలో నుంచి ఓరగా చూస్తూ.



భాస్కరం ఆమె అరకంటి చూపులో వేడి కాగుతూ, "అయితే నేనొక్కణ్నేనన్నమాట మిగిలింది."

అవునన్నట్లు జ్యోతి మౌనం "మరి నాకు నీ అధికారికీ ఏమీ ఇవ్వకపోవటం న్యాయమా." తియ్యగా మాటల్ని పూల చెండు లాగుచ్చి విసురుతున్నట్లు.

"తీసుకోపోవటం అన్యాయమే." ప్రేమ పేరెత్తితేచాలు కాబోలు.ఆడదయినా మగాడయినా ఆత్రేయలా మాట్లాడుతారు!

భాస్కరానికి మొదట్నుండీ ఇక్కడే వస్తుంది చిక్కు.

ఇటు జ్యోతి వెలుగులు చూడలేదు. అటు సరోజ అలుగులు తాళలేదు. సభ్యప్రపంచం నీడికి "సెక్సుమేనియా" అంటుంది, అసభ్య ప్రపంచం (?!) ఇంత మంచివాణ్ణి సభ్యుడిగా చేర్చుకోం పొమ్మంటుంది.

ఈ త్రిశంకు స్వర్గంలో ఊగిసలాడుతూ లోకాన్ని కన్విన్స్ చేసి సెక్సుకు హృదయాల్లో శిఖరాగ్రపీఠం వేయించాలన్న భాస్కరం కోర్కె, ఆశయం అలాగే వుండిపోయాయి. నెరవేరవేమో. ఎలా నెరవేరతాయి! పిండాకూడు. అవి మనుషుల హృదయాల్లో అధమ స్థానాల్లో ఉంటే కదా. ఉన్నదే శిఖరాల్లోనాయె. ఇంకా వేయించేదేవిటి అప్పడాలు!

నిద్ర నటించేవాణ్ణి లేపేదేమిటి! చికెన్ బిరియానీ తిని కోడి ఆత్మశాంతికి ప్రార్థించే లోకం.

అహింస వర్థిల్లేందుకు మహాయజ్ఞం జరిపి మేకను బలివ్వగల లోకం.

కరుణ సమాజం ప్రారంభోత్సవంలో గలాటా జరిగినప్పుడు మంత్రిని రక్షించేందుకు జరిపిన కాల్పుల్లో మరణించిన వారి సంఖ్య కంటపడని లోకం.

పురుల్లో, పాతరల్లో, గోదాముల్లో, బస్తాల్లో బియ్యం మూలుగుతున్నప్పుడు లేనివాడికి వేరుశనగపప్పు, మేకపాలూ ఆదర్శమని ప్రకటించిన సుశ్లోక మీదేశం.

ఆర్థిక రాజకీయరంగాలకే దిక్కులేదు. మధ్యలో పిడకలవేట శృంగారమొకటా! సరిదిద్దటానికీ - చక్కబెట్టటానికీను. జ్యోతి మధ్యలో భాస్కరం ఆలోచనలు ఆపేటట్లుగా.'

'అడిగిందానికి చెప్పకుండా అలా చూస్తారేం' అంది.

'తీసుకోవటం అన్యాయమంటావా' అన్నాడు.

టేబిల్ వెయిట్ భాస్కరానికి తగిలేలా గ్లాసుప్లేటుమీద దొర్లించింది జ్యోతి.

'కాక పాపం, పసిపాపలా నోట్లో పెట్టటానికి' అంది నడుంమీదికి చీర లాక్కుంటూ! అలా లాక్కోపోతే భాస్కరం అటు చూసేవాడే కాదు. భాస్కరం మెదడు స్పృహ తప్పింది.

ఇది తన మంచితనానికి కాంప్లిమెంటో-చేతకానితనానికి కామెంటో సిమెంటో బోధపడలేదు. ఇంత రచయితకూను.

జ్యోతి లేచి భాస్కరం ముందున్న ఫైలు తీసుకుంటున్నట్లు మీదకు వంగి వేళ్ళు తాకుతూ 'సంతకాలు కాలేదు' అంది.

జ్యోతి చీరకొంగు భాస్కరానికి తగుల్తోంది. పదిలీటర్ల రక్తం హృదయానికి చేరింది.

సరోజతో అనురాగ శిఖరంలో వున్నప్పుడు కూడా ఉగ్గిన్నెడు నెత్తురు పైకిరాదు. 'ఎంతతేడా' అనిపించింది.

ఇది సైన్సు.... సెక్సు కాదు. వెధవది ఆ సైన్సు చెవిపోటూ, కడుపు నొప్పీ టాపిక్స్‌గా తీసుకుని ఈ మహత్తర ప్రక్రియను కవిగాళ్ళకూ, తత్వశాస్త్రుంగాళ్ళకీ వదిలిపెట్టటం నిజంగా దారుణం.

దీనిమీద సరోజకివ్వాళ ఉపన్యాసమివ్వాలి. జ్యోతిపైట కొంగని చెప్పకుండా మరోనాతి కొంగని చెప్పేయాలి. లేకపోతే చంపేస్తుంది.

ఇక్కడ జరిగిన అభినందన సభకు ప్రత్యామ్నాయంగా అభిశంసన సభ జరుపుతుందేమో! అసలే పొద్దున ఒంట్లో బావులేదని డాక్టరు దగ్గరకు పోతానంది.

ఆ వెంకట్రావుగాడొకడూ. ఈవిడ నా కథల్ని నిరసించటం. వాడు తాళం వేయటం. వాడు ఈవిడకి ఆరాధ్యదైవం. 'కొంచెం శృంగారం ఎక్కువైనట్లే వుందండి' అంటూ రాగాలు తీస్తాడు.వెధవ ముగ్గురు పిల్లల్ని కన్నాడు. వాడిపెళ్ళాం ఏదో వరం పుచ్చుకుని కన్నట్టు!

## 4

భాస్కరం ఇంటికి చేరేసరికి అనుకున్నట్లే సరోజ తలకు కట్టుకట్టి అమృతాంజనం పట్టించి మంచం ఎక్కింది. 'ఎలా వుంది ఒంట్లో' భాస్కరం బట్టలు మార్చి స్టాండుకు తగిలిస్తూ అడిగాడు.

'చాలా బావుంది.'

సరోజ వ్యంగ్యంగా అందో, పరిహాసంగా అందో పోల్చుకోలేకపోయాడు.

'వెల్- అదే నేనూ కోరుకునేది. లేకపోతే సెలవుపెట్టాల్సొస్తుంది' అన్నాడు భాస్కరం కొంటెగా.

సరోజకు కోప మొచ్చింది. ఇంతటి ప్రేమజీవికి బాధ కల్గినందుకుగాక వెధవ అణాకానీ సెలవుల కోసం భర్తగారు విచారిస్తున్నందుకు.

'పాడు సెలవలకేం చాలా ఉన్నాయిగా!'

'సెలవంటే కాజువల్ లీవుకాదు. ఈ లీవు దీన్నిఎరండ్ లీవ్ అంటారు' అంటూ వంగి ముద్దుపెట్టుకున్నాడు.

'ఎలా బావుపడతావు సరోజా. ఇంత అనుభవమున్న మొగుడు ఫీజుతీసుకోకుండా ట్యూషన్లు చెప్పినా అర్థం కాదే.' సరోజ భాస్కరం ఒళ్ళో తలచేర్చి.

'మరేమో అనుకున్నాను.మీకది తప్ప నోటివెంట మరో విషయం రాదని మర్చిపోయాను' అంది. అని కాసేపాలోచించి ఏమనుకుందో 'నిజంగా మీరు మేనియక్కండి' అంది.

'మేనియక్ స్పెల్లింగ్ చెప్పు' భాస్కరం రెండుచేతుల్తో సరోజను పట్టుకుంటూ.

'ఏం ఆ మాత్రం తెలియదేంటి. బి. ఏ. చదివాన్లెండి'

'చెబుదూ'

"MANEIC"

'అద్గదీ.ఆడదానివీ.తెల్ల శరీరానివీ అయిపోయావు కాని నాతో మాట్లాడటానికి కూడా నీ కర్హతలేదు సుమా.'


పోన్లెండి మరెవ్వరికుంది. జ్యోతికుందేమో!'

'ఆహా సుబ్బరంగా.'

'ఏమిటీ జ్యోతికుందీ.'

## బయటపడని నిజం

ఆకాశం కేసి చూడు
ఆశయాలు అంతరించినాయి
నేలవైపు పరికించు
ఆశలన్నీ నేలపాలైనాయి
సముద్రాన్ని చూశావా!
ఆవేదనలు అలలై వస్తున్నాయి
చుట్టుపక్కల గమనించు
వేడి నిట్టూర్పులు వినపడుతున్నాయి
ఇక నీలో నువ్వు చూసుకో
నిజం బైటపడుతుంది!



–హరిశ్చంద్ర

'అబ్బెబ్బె లేదు.ఆ పిల్ల కసలు ఆఫీసుచైర్లోకూర్చునే అర్హతే లేదు.'

'మరెక్కడ కూర్చోవాలి మీ హృదయంలోనా.'

భాస్కరం కంగారుపడి బండిగాడిలోపడుతుందని భయపడి బలవంతాన మళ్ళించేయాలని 'అన్నట్టు సరోజా– ఈ వీక్లీలో నా కథ చదివావా.'

MSPI
MIGHTY ENERGY FROM THE SUN



DOMESTIC SOLAR
WATER HEATER
(Storage Tank Type)

MAHENDRA SUN POWER INDUSTRIES,
Mfrs. of : SOLAR WATER HEATERS, SOLARDRYERS, SOLAR COOKERS & WIND MILLS
No. 4, PHASE 3 :: AUTONAGAR : GUNTUR-522 009
(ANDHRA PRADESH)



'చదివాల్లెండి ఏముందీ పాతగొడవేగా. మీరూ మీ పాడా లోచన్లూ.'

'ఆఫీసులో అంతా చాలా బావుందన్నారు.'

'ఎవరెవరేమిటీ....'

'ఆ గుర్నాథంగాడి పెళ్ళాం కథలు చదివి ఆ పట్టున పరిగెత్తుకొచ్చేద్దామనుకుందట.'

'ఏదీ బాత్‌రూం నుంచే' సరోజ ! !

'అబ్బే బెడ్‌రూం నుంచటలే' భాస్కరం.

'రమ్మనకపోయారూ.మీకించక్కా ఇహం పరందక్కు తుంది.'

'అవునవును. ఇంపోర్ట్. ఎక్స్‌పోర్ట్ ఆఫీసరు భాస్కరం వీ. డీ. వార్డులో చేరిక' అన్నవార్త పత్రికల క్కూడా ఎక్కు తుంది.

'అబ్బ అక్కడకు ఆఫీసర్లంతా సదాచారులయినట్లు' మొగుడి పుణ్యమా అని ఆఫీసర్లమీదే నమ్మకం లేనట్టు.

'కాదనుకో. అయినా ఆఫ్ ఆల్ ది పీపుల్ గుర్నాధం గాడి పంచకన్నా మనకు గతి అనిచూస్తున్నాను.'

'సర్లెండి సంబడం ఆవిడొచ్చి ఒళ్ళో వాలినట్లు చెబు తున్నారు-ఆఫీసులో అంతా అన్నారు. జ్యోతి కూడానా.'

'అబ్బే యివ్వాళ జ్యోతి అసలు ఆఫీసుకు రాందే.'

'పాపం రాలేదూ. మీకు కాలం గడిచే వుండదు.'

'అవును గడవలేదు' అనుకున్నాడు. 'అన్నట్లు సరూ-ఇవ్వాళ బస్సులో ఓ అమ్మాయి చీరకొంగు తగిలిందోయ్. వెంటనే పెద్ద ఎలక్ట్రిక్ షాక్ తగిలినట్లుగా ఫీలయ్యాను. తగి లింది చీరకొంగేకదా. మరి నీ చీరెలు పది నెత్తిన వేసుకున్నా ఏమీ అనిపించదు. ఏ మహత్యం ఉందంటావు ఇక్కడ.'

సరోజ డిఫెన్సు లాయర్లా భాస్కరం చెప్పే పాయింట్సుకాక స్లిప్స్ కోసం పని కట్టుకు చూస్తుంటుంది. అక్కడే భార్యకూ, ప్రియురాలికీ తేడా.... తప్పు వెతికేది సతీమణి. తప్పులకోసం వెదికేది ప్రియనారీమణి.

'మహత్యం సరే.బస్సులో ఎందుకొచ్చారుజీపురాలేదా.'

'జీపా వచ్చింది' అని నాలిక ముక్కలుగా కరుచుకుని.

'రాలేదు. రాలేదు. చెడిపోయి షెడ్డుకు పోయింది' సర్దే శారు.

'ఊహుఁ' హుంకరించింది సరోజ !

'చెప్పవే' తానడిగిన ప్రశ్న సంగతి గుర్తు చేశాడు.

'ఏం చెప్పనూ. వచ్చే జన్మలో మీరు పందో, కుక్కో అయి పుడతారు.'

'అదృష్టవంతుణ్ని.'

'సిగ్గులేదూ.'

'సిగ్గ....! అహహహహ.... అని పగలబడి నవ్వాడు భాస్కరం.

'దేనికి అలా నవ్వుతారు.'

భాస్కరం పలకలేదు.

'చెప్పండి. ఎందుకలా నవ్వుతారు.'

'భోజనం కానియ్ చెప్తాను.'

'ఇవ్వాళ నేను భోజనం చెయ్యను.'

'ఏమీ. పాపం అన్నట్లు ఒంట్లో ఎలా వుందో చెప్పావు కావు.'

'చెప్తాను. నా కేమిస్తారు.'

"ఇదేమిటి - రోగమేమిటో చెప్పినందుకు డాక్టర్‌కి ఫీజిచ్చొచ్చావు. ఒంట్లో ఎలావుందని అడిగితే నేను ఫీజి వ్వాలా...."

"ఇవ్వాలివ్వాలి. ఇకనుంచి ఎన్నో ఫీజులు-రివాజులు-సీమంతాలు... బారసాలలు...."

భాస్కరం కళ్ళముందు మెరుపు !

చెవులకు పిడుగు .... !

రెండు క్షణాలు అలా చూస్తూ వుండిపోయాడు. 'ఎలా జరిగిపోయింది ఏక్సిడెంటు' అన్న ముఖంపెట్టి

'ఏమో నాకూ తెలియదు .... నేనూ జాగ్రత్తగానే ఉన్నాను....' అన్నట్టు నవ్వింది సరోజ...."

"వెధవ - గోప్యంగావుంచి రహస్యంగా జరపాల్సిన బూతుక్రియను అదేదో ఘనకార్యంగా, జన్మకారణంగా ప్రచారం చేస్తావా - ముక్తి భక్తి అని కలవరిస్తావా....కథలు రాస్తావా....అనుభవించు....నీ శృంగార వీర ఉదాత్త సంభార దారుణ క్రియాపరంపరలకిక సమాప్తి....అనుభవించు...."

అని ఆకాశవాణి కేకపెట్టినట్లు వినిపించింది.

బాబోయ్ .... !

సరోజపాట్లు సరోజపడ్డా. పిల్ల; పాలు; ఉగ్గు, గిన్నె, ఒంచేలు, రెండేళ్లు, చొంగ, ఉంగ !! ఇంచక్కా ఇవి కాకుండా పూలు, పరుపు, పళ్లు, వెన్నెల, దిండు, మూలుగు-అవయితే ఎంత బావున్నాయో !


ఎంత తేడా! ఎంత పరిణామం !

భయం - భయం. వాడు పాలు తాగేస్తాడు !

సరోజను కొరికేస్తాడు, తనదైన అందమంతా లాగే స్తాడు, తన కాలాన్ని నమిలేస్తాడు !

సరోజసలే ఈ దరిద్రపు సమాజానికి కన్‌ఫర్‌మిస్టు '

"మాతృత్వంలోనె ఉంది ఆడజన్మ సార్థకం" అని



అబద్ధపు పాటలు పాడేయగలదు

"ఇపుడేదో "సెక్సు" జీవితానికి పరిమితావసరం అని పరోక్షంగానైనా ఒప్పుకుంటుంది.

ఇహసలప్పుడు "అలాంటి దుర్మార్గపు మాటలు నా ముందు మాట్లాడకండి" అంటుందేమో।

రాసెయ్యాలి. కథ రాసెయ్యాలి.... ఈసారి కథలో.

"పిల్లలకోసం తల్లులుకాకూడదు; తల్లులవలన పిల్లలు పుట్టొచ్చు. తాము ఏ ముగ్ధమోహనసౌందర్యం అరనయనాగ్ని లో కాలిపోయిన ఫలితమో-

ఏ తల్లితండ్రుల అపురూప సౌఖ్యాన్వేషణలో అవిర్భావమో.

ఏ ఆనందాల విట్టూర్పుల కూర్పో

ఏ ఉష్ణరక్తకాసారాల విరిసిన పుష్పాలో।

గ్రహించుకుని పిల్లలు కృతజ్ఞతగా వాళ్ళకుసౌఖ్యంగా కొనసాగనివ్వాలి. వాళ్ళ ఆనందం చిరకాలం వర్ధిల్లాలని కోరుకోవాలి.

అంతేకాని తాము పుట్టేశాం .... భావిపౌరులం .... ఇహ తల్లీ తండ్రీ సన్యాసం పుచ్చుకోవచ్చు అనరాదు. థాంక్లెస్‌గా అన్‌గ్రేట్‌ఫుల్‌గా తాము పుట్టిన చర్యను నెల తప్పకుండానే నిరసించి. నీరసింపచేసేటట్లు తయారుకాకూడదు.

పిల్లలు అభివృద్ధి నిరోధక శృంగార ప్రతిఘాతశక్తులు కారాదు. ప్రణయజీవన ప్రగతివృక్షం చివరన చివురించిన కిసలయాల్లా కిసకిసలాడాలి.

పిల్లలకీబాధ్యతాయుత రాజ్యాంగ ప్రవర్తన ఎటూ తెలియదు. పూర్‌దంబ్ మిలియన్స్. మూగముద్దులు. దొంగ వెధవలు.

ఏం తెలియకుండానే సామ్రాజ్యానికి నిప్పంటించేసే పెటీపెటీ.... వీళ్ళను జాగ్రత్తగా అదుపులో ఉంచేసుకుంటూ వాళ్ళకు చాక్లెట్లూ, బుల్లిచెప్పటూ కొనిపెట్టేసి, ప్రక్కగదిలో పడుకో ట్టేసి తల్లిదండ్రులు తమ ప్రయాణంకొనసాగించాలి.

సెక్స్ ఫర్ చిల్డ్రన్ కాదు.

'చిల్డ్రన్ ఆఫ్టర్ సెక్స్-అన్న ప్లేకార్డులు రాసి ఊరేగింపుచేయాలి.'

భాస్కరం థియరీప్రకారమైనా భవిష్యత్‌సుధా కథానాయకులువాళ్లు।

ఈ లోకంలోకొచ్చిన భాస్కరానికి సరోజ పొద్దున్న విరిసిన గులాబీలా కనిపించింది;

భోజనం ప్రోగ్రాం 'స్కిప్'చేసి సరోజను ఎత్తుకుని వెన్నెల్లోకి పోదామని ఉపక్రమించేంతలో-

వెంకట్రావొచ్చాడు. "భాస్కరరావుగారూ" అంటూ.

"ఆఁ రండి-రండి" అని సాదరంగా ఆహ్వానించింది సరోజ. డ్రామాలో విష్కంభానికి సంతోషిస్తూ.

"ఏం చేస్తున్నారు" అన్నాడు. వెంకట్రావు।

"ఆయన్నే అడగండి" అంది.భాస్కరం అఘాయిత్యపు ఛాయలేవీ కనిపించకుండా సర్దుకుంటూ.। భాస్కరం నిరపాయకరంగానవ్వి "మీకోసమే చూస్తున్నాను.." అనేయగలిగాడు.

సరోజ తన ఆదర్శ పురుషుడికీ అవసర పురుషుడికీ రెండుకాఫీలు కలిపేందుకు వంటింట్లోకి నడిచింది.

## 5

"మీ కథ చదివానండోయ్" అన్నాడు భాస్కరంవేపు చూస్తూ వెంకట్రావు. భాస్కరం "చింతామణి"లో భవానీశంకరుడి పాత్రవేస్తూ "రాయబారం"లో ధర్మరాజు ముఖం పెట్టి కూచున్నాడు,

"ఎలా వుంది." భాస్కరం తాతగారి తద్దినం పెట్టినట్టు మాట్లాడాడు.

"బావుందండి" వెంకట్రావు.

"హీరో భార్య పుట్టింటికి పోయినప్పుడు ఆ అమ్మాయితో ఉన్న సీను చాలా నాచురల్‌గా వచ్చింది."

"నాచురల్‌గా అంటే."

సరైన కథకుడికిగాని, కవికిగాని తన రచన బావుందో లేదో ముందే తెలుస్తుంది. తనకంటే చిన్నవాళ్ళు అభినందిస్తే వాడిమీద "మరో రచన కోసం" ప్రయోగాలు జరుపుతాడంటే ముఖ్యంగా వెంకట్రావుని మాటల్తో కరెక్ట్ చేయటం భాస్కరానికి సరదా.


"అదేనండీ పరిస్థితీ వాళ్ళ ప్రవర్తనా - వాస్తవంగా ఉన్నాయి."

"వాస్తవంగా అంటే." భవిష్యత్తులో రచయితగాడితో ఎవరితోనూ మాట్లాడకూడ దనిపించింది వెంకట్రావుకు. కదిపాడు కనుక తప్పక.

"అంటే అతడలా చేయటం." అనిగొణిగాడు. మళ్ళేం అడుగుతాడో అని వెరుస్తూ. జవాబునసిగితే ప్రశ్న వేసినవాడే "ఆన్సరు" చెప్పటం సహజంగా చర్చల్లో పరిపాటి.

అతడలాచేయటం మంచిదేనంటారా ?

వెంకట్రావుకి ఇంతకంటే ఏ రేప్‌కేసులోనో ఇరుక్కోవటం సుళువనిపించింది.



"ఎక్కడ బావుంది." రచయితైన వాడికి వాడికథో కవితో బావుంది అనటంకంటే బావులేదు అనటం ఆసక్తిదాయకంగా వుంటుంది. కనీసం ఎందుకు బావులేదో అన్నా అడగొచ్చు. బావుందనటం అతని "ఇగో"ని సంతృప్తి పరచదు. ఎదుటివాడు తనకంటే బాగా గొప్పవాడై ఉంటే తప్ప.

"మంచిదోకాదో-చేశాడుకదా"

"మీరాపరిస్థితిలోవుంటే అలా చేస్తారా"

వెంకట్రావు లాయరుగార్కి ఎదురుతిరిగాడు.

"ఎప్పుడూ నన్నే అడుగుతారేం? మీరు రాసినవారుకదా మీరు చెప్పండి"

"నేను చేస్తాను. అన్యాయమంటారా?"

వెంకట్రావు మాట్లాడలేదు. కాసేపటికి-

"అన్యాయమైనా-న్యాయమైనా అలానే జరుగుతుందని పిస్తుందండి."

"కరక్ట్. చాలా సంతోషం. మీ అభిప్రాయం సరోజకూడా చెప్పండి."

"ఏం అభిప్రాయం కథమీదేనా" సరోజ ట్రేలో కాఫీలిస్తూ

"మరేనండీ" వెంకట్రావు.

"చాలా నేస్టీగావుంది కదండి" సరోజ ముందు చర్చను తెలుసుకోలేదు కనుక స్వంత ధోరణిలో అనేసింది.

"ఇహిహి" అని నవ్వాడు వెంకట్రావు।

అవునన్నట్లు ధ్వనించిందా నవ్వు।

భాస్కరం బిత్తరపోయాడు.

"మీరుకూడా చెప్పండి వెంకట్రావుగారూ. అలా రాస్తే ఆడవాళ్ళెవరయినా చదువుతారా? ఆ పత్రికవాడు దివాలా తియ్యడూ?"

"తీస్తాడు" వెంకట్రావు।

'ఇందాక వెంకట్రావు మాటలు టేప్ రికార్డు చెయ్యక పోతినేమా' అనిపించింది భాస్కరానికి.

"అలా భార్యలేనప్పుడు విచ్చలవిడి శృంగారమేమిటి పైగా భార్యను ఆప్యాయంగా చూస్తాడట ఆప్యాయత అసహ్యంగా లేదూ?"

"కొంచెం అసహ్యంగానే వుందండి. మరీ అలా రాయకుండా ఉండాల్సిందేమో" వెంకట్రావు ఆటలో "రిఫరీ"లా।

"భార్యకూడా అలానే చేసినట్లు రాశానుకదా" భాస్కరం మధ్యలో.

"అదో ఛండాలం. అయినా ఇవన్నీ ఎక్కడో లోక్లాస్ పీపుల్ తప్ప ఎవరు చేస్తారండీ."

"అవునవును" అన్న వెంకట్రావు నాలిక పీకేయాలనిపించింది భాస్కరానికి. రెచ్చిపోయాడు: ప్రక్క కుర్చీలో కూర్చున్న సరోజవేపు తిరిగి

"అన్నట్లు సరోజాదేవి. మీ మామయ్య ఏం చేస్తున్నాడు."

"ఏమీ. ఇన్కంటాక్స్ ఆఫీసరు."

"ఆయనకెన్నో పెళ్ళి?"

"రెండో పెళ్ళి"

"మొదటి భార్య ఏమయింది?

భర్తకు సమానంగా సమాధానాలిస్తున్నానన్న కులుకు తప్ప సంభాషణ చివరికేసి చూళ్ళేకపోయింది సరోజ. సారాం

శంగా మొగుడు ఏ దారుణాన్ని తేల్చినా లెక్కచెయ్యదు కనుక సుళువుగా జవాబులిస్తుంది.

"ఏమయ్యిందీ ఈయన తిరుగుళ్ళు నచ్చక డైవోర్సిచ్చిపోయింది."

"మీ నెల్లూరు పిన్ని బ్రతికుందా."

"చచ్చిపోయింది."

"ఏం? పావం నడివయసేగా-"

"వాళ్ళాయన సాధించాడంటారు."

"దేనికో?"

"ఈవిడ చాలా అందంగా వుంటుందని."

"అందంగా వుంటేనే సాధించాడా."

"కారెక్టర్ మంచిది కాదంటారు."

"మరి వీళ్ళంతా లోక్లాస్ వాళ్ళేనా."

"దానికి, దీనికేం సంబంధం ఫేమిలీస్ అన్నాక అనేకం జరుగుతాయి? ఏమండీ వెంకట్రావుగారూ."

పిల్లికి ఎలుక సాక్ష్యం.!

వెంకట్రావు "అంతేనండీ" అంటే మీదపడి చంపేయటానికి సిద్ధంగా ఉన్నాడు భాస్కరం. భాస్కరం మూడ్ గమనించాడో ఏమో- "అంటే లోక్లాస్ అనేముందిగాని సరోజ గారూ. ఎక్కడైనా అప్పుడప్పుడు జరుగుతుంటాయండీ- ఇద్దరు కాట్లాడుకునే దేశాలనాయకులుశాంతిసంభాషణలు జరిపింతర్వాత పెట్టే 'కెమెరా పోజు'లా వుంది వెంకట్రావు పరిస్థితి!

"అద్బ ఈయన రాసింది చీప్‌గా ఉందండీ. దీనికి. దానికి, ఏమిటి పోలిక" సరోజ మొండిగా రెట్టించింది.

"పెళ్ళికి, పెళ్ళానికి ఉన్నపోలిక!"

భాస్కరం ఒళ్ళు మండిపోయింది!

సరోజ మూతి ముడిచింది, నేనొప్పుకోనుకాక ఒప్పుకోనన్నట్లు. భాస్కరానికి మూర్ఖత్వమంటే ఎక్కళ్ళేని చిరాకు. కత్తిపోటయినా సహిస్తాడుకాని కారణం లేకుండా వాదిస్తే అతనికి కసివుడుతుంది.

"ఎప్పుడైనా దేవాలయాలమీద బొమ్మలు చూశావా?"

"చూళ్ళేదు" ఎదురుతిరిగిన సరోజ రెట్టమతం జవాబునిచ్చింది.

"కోణార్క్. ఖజురాహో గుహల్లో ఏమున్నాయో తెల్సా."

"తెలియదు."

"ప్రబంధాల్లో కొబ్బరికాయలూ. అరటి బోదెలూ వేని ఉపమానాలో చదివావా."

"చదవలేదు."

ఈ ఊపులో 'నువ్వారదానివేనా' అంటే గ్యారంటీగా కాదనేటట్లుంది.

"ఫ్రాయిడ్ అనే పేరిన్నావా?"

"వాడెవడూ?"

"నీ మొగుడు కానందుకు సంతోషించు."

"పోన్లెండి భాస్కరంగారూ ఆవిడభిప్రాయం ఆవిడది. చర్చెందుకూ" వెంకట్రావు సర్దబోయాడు.

"ఆవిడభిప్రాయం ఏవిటో ఆవిడకన్నా తెలియాలి కదండీ." ఆవేశంగా భాస్కరం.

"తెలుసుకుంటుందిలెండి."

"నేనెప్పుడో తెలుసుకున్నాను." సరోజ పూర్తిగా అడ్డం తిరిగింది.

"ఏం తెల్సుకున్నావ్ విష్ణుమానసపుత్రుడెవరో తెల్సా."

"తెలియదన్నానుగా."

"తారాశశాంకం కథవిన్నావా."

'విన్లేదు.'

'అన్నా కెరీనీనా నవల చదివావా?'

'చదవలేదు.'

'పావం ఇంగ్లీషు సినిమాలుకూడా చూసుండవ్.'

................

'కృష్ణరాయల కెందరు భార్యలు?'

'వాళ్ళు రాజులు.'

'ఎలిజిబెత్ టేలర్ కెందరు భర్తలు.'

'వాళ్ళు పెద్దవాళ్ళు.'

'సినిమాతార రేఖ ఏమందో నీవుచూళ్ళేదు కామోసు.'

హు ఎవరి బుద్ధులకవే కనిపిస్తాయి. మీ ప్రక్కనున్న ఆయనకు ఇవన్నీ తెలియవా.... ఆయన చెప్పడేం.'

'ఆయన నీ ఆయన కాదుగా' అనుకున్నాడు భాస్కరం.


వెంకట్రావు ఇవన్నీ ఎందుకుచెప్పడో భాస్కరానికెలా తెలుస్తుంది. సూర్యుడెందుకు వేడిగా ఉంటాడని చంద్రుణ్ణడిగితే ఏం సొంపుగా ఉంటుంది.?




## 6

శనివారం మధ్యాహ్నం ఒంటి గంటయింది. ఆఫీసు ఒంటిపూట కావటంచేత అంతా వెళ్ళిపోయారు.

## “కూనలమ్మ కూతలు”



రాజకీయము సంత
చినిగిపోయిన బొంత
బాగుపడునా కొంత
ఓ కూనలమ్మ

ప్రజాధనం స్వాహా
పార్టీఫండు స్వాహా
ప్రజాస్వామ్య మాహా
ఓ కూనలమ్మ

ధరలు చూస్తే జాస్తి
తగ్గుటన్నది నాస్తి
దరిద్రం మన ఆస్తి
ఓ కూనలమ్మ

ఆహారాలు కల్తీ
రాజకీయాలు కల్తీ
రాజ్యాంగమే కల్తీ
ఓ కూనలమ్మ.

[అంకితం : ఆరుద్రకి]

—ఎండ్లూరి సుధాకర్

ఇంకా పని తెములనట్లు ఒక్క జ్యోతి మాత్రం తన చైర్‌లో మిగిలిపోయింది.

భాస్కరం తనరూమ్‌లోకూర్చుని ఫైల్సుతిరగేస్తున్నాడు.

జ్యోతి ప్యూన్ అప్పారావుని పిలిచింది.

'ఏమోయ్ అప్పారావ్. శనివారంగదా ఇంకా వెళ్ళలేదే'

'బాబుగారున్నారమ్మగారూ. తాళాలు వెయ్యాలిగదండీ.'

'నేనువేస్తాన్లే పావంనువ్వు మేట్నీసినిమాకుపోతావేమో'

ఏం సినిమా లుండాయమ్మగారూ.'

'మన్మధలీల'ని మంచి సినిమా ఉంది. మీ ఆవిణ్ణికూడా తీసుకెళ్ళు.'

'డబ్బుల్లేవండీ.'

'నేనిస్తాన్లే వెళ్ళు' ఈ అనవసర ఆప్యాయతకు వాడదిరిపోయి. రెండు రూపాయలుచ్చుకుని పళ్ళన్నీ బయట పెట్టి

'తాళాలు మరచిపోకండే' అని చెప్పి వెళ్ళిపోయాడు.

జ్యోతి జాగ్రత్తగా ఓఫైలు పుచ్చుకుని స్ప్రింగ్ డోర్ శబ్దం కాకుండా తీసి భాస్కరం రూమ్‌లోని కెళ్ళింది.

భాస్కరం తలెత్తి చూసేసరికి ఎదురుగా జ్యోతి నిలబడి పరీక్షగా చూస్తోంది.

'ఏం జ్యోతీ, ఇంకా వెళ్ళలేదే. అంతా వెళ్ళిపోయినట్లున్నారు-' పలకరించాడు.

'అందరికీ ఇళ్ళదగ్గర ఎదురు చూసేవాళ్ళున్నారు. నాకెవరున్నారు.' జ్యోతి కాసింత గారాంపోయింది

భాస్కరం ప్రశ్నార్థకంగాచూసి 'ఈ పిల్ల అందరితోనూ ఇలాగే మాట్లాడుతుందా' అనుకున్నాడు.

'మీరు వెళ్ళరా అండి'మళ్ళా జ్యోతే అడిగింది.

'ఇంటిదగ్గర నాకుమాత్ర మెవరున్నారూ'అర్థయుక్తంగా భాస్కరం చేతిలో బాల్‌పెన్ క్రింద పెడుతూ.

'అదేమిటి పాడూ-కొండంత సరోజగారుంటే.'

'సరోజకు డైవోర్సిచ్చాను' సరదా అని తెలుస్తూనే వుంది మాటల్లో.

'చాల్లెండి మరీను' అని జోకును కంటిన్యూ చేద్దామని 'ఎందుకిచ్చారూ' అంది బుగ్గలు చొట్టపడేలా.

'ఎందుకేముంది. ఆఫీసులో అమ్మాయితో చనువుగా ఉంటున్నానట అనుమానించింది. వెంటనే ఈ కాపురం చెయ్యలేను. తననో,నన్నో ఎన్నుకోండి అంది. అలాగేలే ఆఫీసులోనే కాపురంకూడాపెట్టుకుంటానుపోతేపోఅన్నాను-డైవోర్సిచ్చింది'

జ్యోతి మూతి మూడు వంకర్లు తిప్పి 'అబ్బో పాపం మీ నెక్స్ట కథకు ప్లాటుకాబోలు వినిపిస్తున్నారు. సరోజగార్కి ఈవినింగ్ కూడా ఆఫీసుండుంటుంది బడాయి!

భాస్కరం కుర్చీలో ముందుకు వంగి. 'లేదు జ్యోతీ, సరోజ పిక్నిక్‌కు వెళ్ళింది.'

'పిక్నిక్‌కా- ఎవరితో'

'తన ఆదర్శ ఫ్రెండు వెంకట్రావుతో'.

'ఆ బ్యాంక్ కాషియరా?'

'ఆఁ'.

'ఏవిటీ.వెంకట్రావూ' ఈవిడానా?' జ్యోతి ఆశ్చర్యంగా.

భాస్కరం తప్పుసవరించుకొంటున్నట్లు'అందాకాయెదగ లేదుకాని వాళ్ళఫామిలీ కూడా వున్నార్లే' అన్నాడు.

'మీరుకూడా వెళ్ళకూడదూ'

'నాకర్జంటు పన్లున్నాయి. రాలేనన్నాను.'

'ఏవిటండీ అంత అర్జంటు పనులు!'

'గుమాస్తావు నీకేం తెలుస్తుంది ఎన్నుంటాయో?'

'అవున్లెండి నాకేం తెలుస్తుంది' - వయ్యారంగా అని ఇహ లాభంలేదు 'కూర్చోమనేటట్లులేదని' తానే కూర్చుంది.

భాస్కరం అవకాశం అందంగా కనిపించిందిగదా అని తానుకూడా మాటల్లోకి దిగాడు. 'అన్నట్లు జ్యోతీ, నువ్వు పెళ్ళెందుకు చేసుకోలేదు.'

రెండు చేతులవేళ్ళూ ముడివేస్తూ 'ఎందుకు చేసుకోలేదు.' తిరిగి ప్రశ్న!

భాస్కరం నొసలు ముడిచి'అంటే చేసుకున్నావనమాట-మరి వాడేమయ్యాడు'

'నన్నేం చేసుకోవాలో తెలియక వెళ్ళిపోయాడు.'

అర్థమైందన్నట్లు చిరునవ్వు సారించాడు భాస్కరం!

'ఊరిలాగే ప్రవర్తించి ఉంటావ్' చిలిపిగా అన్నాడు.

'ఎలాగా' జ్యోతి అనుమానంతో.


'ఇలాగా' జ్యోతి శరీరంకేసి చూస్తూ.

జ్యోతికేదో మంచి పాయింటు దొరికినట్లు సంతోషంగా

## గులాబీ ఆదర్శం

పువ్వు పువ్వుని రక్షించుకోడానికి
ముల్లు ముల్లుని పదును పెడుతుంది
రక్తాన్ని కళ్ళజూశానన్న తృప్తి
ఆ ఎరుపు జీరలో
శతృవుని భయపెడుతున్న వేడి
ఆ ముల్లు వాడిలో
అందుకే గులాబీ మొక్కంటే నాకిష్టం
దానికి మాత్రం మనమంటే అయిష్టం
నువ్వు నేను పిరికివాళ్ళమని
దాని కసహ్యం.

—వీరభద్రరావ్ పమ్మి



ముఖం పెట్టి 'మరి మీరు కథల్లో రాస్తుండేదేగా'

'ఇదా, మొగుళ్ళ నొదిలేయమనా- రామ రామ.'

'పోనీ మీరుకాకపోతే చలంగారు.'

చలం పేరెత్తగానే భాస్కరం అనే మగవాడు కాస్తా పిస

లైన మనిషైపోయాడు. సుంత ఆవేశమూ, కొంత ఆవేదనా కల్గాయి.

'చలం రాసిందేనా తను రాస్తుంది' అన్న భావం కల్గింది. రాసినా తప్పులేదు. కానీ తను కేవలం చలానికి కార్బన్‌కాపీనా అన్న భయం కల్గింది. చలం ఎన్నో చెప్పాడు ఎన్నో చేశాడు. ఈ లోకంతో వేగలేక దాని తిట్లన్నీ భరించి. అరుణాచలం పోయాడు- మహానుభావుడు వెళ్ళిపోతూ.

'శృంగారం గూర్చి పదితరాల వరకూ ఎవడెప్పుడు రాసినా చలం మార్కు రచన' లనేటట్లు చేసిపోయాడు.పిల్లకారు రచయితలు 'ఆ మర్రిచెట్టుక్రింద ఇహ పెరగరా' అన్నంత రాసిపోయాడు.

చలం ఆలోచనల్ని సవరించుకుంటూ రాసుకుపోదామన్నా 'ఏడ్చావులేవోయ్ ఆయన అన్నీ చెప్పేపోయాడు. మళ్ళీరాసే దేమిటి' అనేయగలరు.

చలం అన్నప్రాసన్నాడే సమాజానికి అవకాయ తిని పించాడేమోననిపిస్తుంది భాస్కరానికి.

అత్యంత సాహసం, మొండితనం, ప్రతిభా కల్గివుండ టంచేత, అసహనంవల్ల తాను పోయిన వేగానికి తట్టుకోలేక వెనక్కు పడిపోయిందేమో లోకం. తాను రచయితే కాని సంస్కర్త కాడు. సంస్కర్త రచయితైతే చలాన్ని చల్లబరిచి పిల్లవాయువులు వీయించేవాడేమో.

'అన్నీ వేదాల్లో ఉన్నాయష' అయిపోయిందిప్పుడు.

'అంతా చలం రాసేశాడు'అనుకోవాల్సివచ్చింది. కమ్యూ




విస్టులూ, ఇతర అభ్యుదయవాదులూ అపారంగా గౌరవించారు చలాన్ని. మిగతావాళ్ళు కొందరు 'పాపిష్టి' అన్నారు. కొందరు 'కోపిష్టి' అన్నారు. కొందరు సుందర నందనవనమన్నారు. కొందరు విశా స్మశానమన్నారు.

మరికొందగ్ర వ్యాపారులు చలం చెప్పిందాన్ని వదిలి. రాసిందాన్ని తూకాలువేసి అమ్ముతున్నారు.

పాఠకుల్లో అమాయక స్త్రీలు కొందరైనా 'చలం' అనే ఒకే ఒక్క రచయిత వ్యభిచారానికి రాచబాట వేసిపోయాడను కుంటున్నారు.

మనిషి ఆర్థిక ప్రవృత్తిమీద అంతగా శ్రద్ధ చూపని చలం తనకు లభించినంత గౌరవానికి బదులు తీర్చలేక పోయా దేమో ఈ తెలుగుదేశానికి.

ఇన్ని ఆలోచన్లు కదిలాయి భాస్కరానికి. జ్యోతి చూస్తూ కూర్చుంది. చలంగారి పేరెత్తానుకదా. చాలా అందమైన జవాబు ఒస్తుందన్నట్లు.

'చలంగారివేం చదివావు జ్యోతీ?'

'మైదానం చదివాను.'

'నీకు నచ్చిందా.'

'చాలా బాగా నచ్చింది.?

'ఎందుకు నచ్చింది?'

ఏదో చెప్పబోయి జ్యోతి ఏం చెప్పలేక. 'అలా హాయిగా ఉండటం నచ్చింది'.

'మైదానంలో కూడా నీళ్ళులేకుండా పొద్దస్తమానం సాయిబూ ఆవిడా ఆడుకోవటమేనా?'

తలాడించింది జ్యోతి.

'మరి నిన్ను అలాంటివాడు ఆహ్వానిస్తే ఈ ఉద్యోగం వదిలేసి వెళ్ళిపోతావా?'

'ఉద్యోగం ఎందుకు వదలాలి.'



'మైదానాల్లో తిరిగేటందుకు ఈ జీతమెందుకు ఈ శ్రమెందుకు?'

'డబ్బుకోసం.'

భాస్కరం ఫక్కున నవ్వి....

'డబ్బెందుకు జ్యోతి. ఓ అరసోలెడుబియ్యం మూకుట్లో ఉడకేసుకుని హాయిగా ఇరవైనాలుగ్గంటలూ క్రిందా మీదా పడొచ్చుగా.'

'నేనలా వుండలేను బాబూ.'

'పోనీ ఎలా వుండగలవో చెప్పు.'

చెప్పలేకపోయింది.

'పోనీ- నేను చెప్పనా. నీకు స్వేచ్ఛమీద ఎంత ప్రేమో ఉద్యోగంమీద అంతే ప్రేమ. మగవాళ్ళంటే ఎంతిష్టమో చీర లంటే అంతే యిష్టం

నిన్నద్దగించేవాళ్ళంటే ఎంత కోపమో మొగుడంటే అంతే కోపం. ఇసుక గదుల్లోనూ బ్రతకలేవు. మైదానాల్లోనూ బ్రతకలేవు. అవునా.?

అవునేమోనన్నట్లు కళ్ళు తిప్పింది.

'నినోమ్మాటడగనా జ్యోతి'

'అడగండి!'

'ఊరికినే మాటవరసకు నేనాఫీసరుద్యోగం వదిలేసాస్తాను. నాతో వచ్చేస్తావా ఎటయినా వెళ్ళిపోదాం.'

ప్రశ్న ఇంత పొదుగ్గా లేకుండావుంటే 'ఊఁ' అనేది తేలిగ్గా. మరి ప్రశ్న జీవితంలా ఏమిటో షరతుల్తోఉంది. అయినా అని చూద్దామని 'ఊఁ' అంది గొప్పగా.

'మద్రాసు వెళ్ళిపోదాం నేను హోటల్లో క్లీనర్గా చేరతాను. నువ్వు నాలుగిళ్ళలో పనిచేద్దువుగాని రాత్రిళ్ళుహాయిగా.

'అలాఎందుకు? అక్కడా మీరుద్యోగం చెయ్యొచ్చుగా.'

'ఉద్యోగమెందుకమ్మాయ్. నేను చాలదా నీకు నా స్టేటస్ కూడా కావాలేమిటీ-చెప్పు నాతో వస్తావా-రావా.'

'------' జ్యోతి!

"మాట్లాడూ" జ్యోతి చెయ్యిమీద కొట్టాడు.

"అసలెక్కడికో ఎందుకెళ్ళాలి .. ఇక్కడే యెందుకలా వుండకూడదూ?"

భాస్కరానికి చిరుకోపమూ. జాలీ కలిగాయి. ఇక్కడే అలా చెయ్యాలంటే మరి సరోజకూ్కడా ఓ ఆఫీసర్ని చూపించాలి. తను నీ అంత పొరవకల్గిన మనిషికాదు.

లేకుంటే సరోజను వదిలెయ్యాలి....ఆ పిల్ల ఆకోపంలో ఏ విషమో పుచ్చుకుంటుంది....ఆ హత్యాపాతకం మనిద్దరం మొయ్యాలి. ఆ అభాగ్యురాలినలా గోదార్లోపారేసి మనిద్దరం ఏ బృందావనమో హనీమూన్కి పోవాలి. అవునా?'

జ్యోతి లేచి తన రూమ్వేపుకు నడిచింది. జ్యోతి ముఖం ఇతని మాటల వేడికి వడిలిపోయింది. అలా వడిలిపోయి ఎంతో ముద్దుగా వుంది.

"జోతీ. మాట" వినకుండా వెళ్ళింది! భాస్కరం కుర్చీలోనుంచి లేచి పిలుద్దామా వద్దా అనుకుంటూ . . . ఎందుకో వెనకాడి-

— ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

## సత్యం

మీ యౌవనాన్నంతా
వాళ్ళు చీల్చి ముక్కలు చేసి పారేస్తారు
వాళ్ళ పదబంధాల ముఖకవళికల్లోనూ
బుజ్జగింపుల దువ్వాళ్ళలోనూ పడగ్గది ద్రోహాల్లోనూ
సత్యాన్ని చూడగలరా?
గొంతు నులిమేవాళ్ళ ముసుగుల్లోనూ
వికారపు వాసనల్ని వెదజల్లేవాళ్ళ గాయాల్లోనూ
వాళ్ళలో తొడల వ్యాపార ప్రేమల్లోనూ అందాన్ని
చూడగలరా?
సత్యమూ అందమూ ప్రేమా-
కార్మికులు బద్దలుగొట్టే- వాళ్ళ గదుల్లో పేరుకున్న
మృత్యు ప్రశాంతత
సరిహద్దుల్ని దాటిపోయే ముద్దుగానీ
జంటల కౌగిళ్ళలో వికసించే పూలుగానీ
ప్రేమభరిత హస్తాల్లోని శిశువుగానీ
ఆరోగ్యంతో నవనవలాడే స్త్రీలుగానీ-
అన్నింటినీ వాళ్ళు పోగొట్టుకున్నారు
మనం సామూహికంగా-వాటన్నింటినీ
ప్రపంచం రహదారిమీద బహిర్గతం చేద్దాం-

–డేవిడ్ డియోప్
(ఆఫ్రికన్ కవి)
అనువాదం : శ్రీ కె. శివారెడ్డి

దేరీజ్ నథింగ్ సేక్రెడ్ అండ్ సీక్రెట్ ఇన్ సెక్స్ (శృంగారజీవితంలో పవిత్రమూ. రహస్యమూ ఏమీ లేవు) అన్న వాక్యం గాజుప్లేటుమీద రాసి చెరిపేశాడు. ఆ తర్వాత "మనిషే సర్వ ధర్మాలకు మూలం" అన్న మాటలు గుర్తుకొచ్చాయి అతనికి.

మనస్తత్వవేత్త ఫ్రాయిడ్.

"ఇడ్ - ఇగో - సూపర్ ఇగో" అన్నాడు. ఇవి మూడు మానసిక దశలు. ఇడ్-పశుతత్వం లేక శిశుతత్వం. ఇది మొదటిది - అవయవాలకు హేతుదృక్పదంలేదు. మనిషి అంతరాంతరాల్లో ఈ దశ వుంటుంది. అవి యిష్టంవచ్చినట్లుచేస్తాయి. కోరింది తింటాయి, కోరినట్లు అనుభవిస్తాయి. సంతోషం లేక బాధ. రెండే విషయాలు. పర్యవసానం యోచించవు.

"యాభై ఏళ్ళ మనిషి నాలుగేళ్ళపిల్లను మానభంగం! వావివరసలు లేకుండా చెరిచిన ఉదంతాలు" ఈ దశకు నిదర్శనాలు. ఇదే "ఇడ్" అంటారు!

ఈ దశలోని వివత్కర పరిణామాలను,పర్యవసానాలను గమనించిన మనస్సు ఆత్మరక్షణ నేర్చుకుంటుంది. నా-నాది-నేను-నా సౌఖ్యం-నా అనుభవం అనే మాటలేర్పడతాయి. ఆ మాటల్ని రక్షించుకునేందుకు పశువులా కాకుండా "తెలివిగల" వింత పశువులా జీవించటం నేర్చుకుంటాడు. ఇది రెండవ దశ ఇగో—

రెండవ దశకు నాగరికత తోడవుతుంది. విద్య, సంస్కారం, కళ, సంస్కృతి, జీవనం, హోదా, స్థాయి, డబ్బు, ప్రతిభ, పరువు-ప్రతిష్ఠ అనే ప్రమాణాలు మనిషిని ముంచెత్తుతాయి. మనస్సు బందీ అయిపోతుంది. దాని మౌలిక స్వరూపం కోల్పోయి కృత్రిమాభరణాల్తో, చిరునవ్వుల్తో, నటనల్తో, మర్యాదల్తో, ఆత్మవంచనల్తో నాటకం ఆడుతుంది మనస్సు. ఇది సూపర్ ఇగో-

ఈ మూడు దశలూ ఉన్నా ఒక్కొసారి హఠాత్తుగా ప్రథమ దశలోకి దొర్లిపోతుంటాడు. కారణం అది అన్నింటికంటే జీవసహజమైన దశ. బలవంతాన నొక్కిపెట్టబడింది.

రోడ్డుమీద ముద్దుపెట్టుకోవటం....

హఠాత్తుగా హత్యచేయటం.

అనాలోచితంగా ఓ స్త్రీపైకి దుమకటం ఇత్యాదులిందుకు నిదర్శనాలు.

నాగరిక సమాజం ఈ దశను ఆటవికమని తిరస్కరిస్తుంది. ఈ దశకు తగినంత గౌరవం యిచ్చి ఆత్మవంచన వదులుకున్నప్పుడు సమాజం ఇంకా సౌఖ్యవంతమవుతుందని మనస్తత్వవేత్తల భావం.

ఆ భావం ఎన్నటికీ చలామణి కాదేమోనని మహామేధావుల్నుంచి, భాస్కరందాకా అందరికీ భయమే.

భాస్కరం బుర్ర గిరగిర గిరాం గిరాం భ్రమణం భ్రమరం అని తిరుగుతుంది యోచనాప్రపంచంలో.

తిరిగి జ్యోతి కాఫీతో లోపలికొచ్చింది.

"కాఫీ తాగండి" అంది.

"కాఫీనా, నాకా, నా ఫ్లాస్కులో ఉందిగా జ్యోతీ" ఆశ్చర్యంగా భాస్కరం.

జ్యోతి సీరియస్‌గా చూసి– "సరోజగారు రోజుకు నాలుగుసార్లిస్తారు. నేను ఎప్పుడో ఒకసారయినా ఇవ్వకూడదా" జాలిచూపుల్తో అంది.

భాస్కరం ఓ క్షణంచూసి- "ఎందుకివ్వకూడదూ కానీ సరోజ ఇలా యివ్వదే" అన్నాడు-అర్థంచేసుకో అన్నట్లు!

జ్యోతి గ్రహించింది. ఇలాంటివి కొట్టినపిండి తనకు! సాసరు క్రిందపెట్టి కప్పు నోటి కందించింది. భాస్కరానికి అమృతం తాగినట్లుంది. సరోజిచ్చినప్పుడు ఇలావుండదేం.! సరోజ భాస్కరుడిక్కాకుండా మరో తస్కరుడికిస్తే ఇలానే వుంటుందేమో.... అనిపించింది. ఉండొచ్చుండొచ్చు.!

### 7

'సరోజా, మాట మాట- అర్జంట్, తొందరగా రావాలి.' కేకేశాడు భాస్కరం.

'ఏమిటండీ.. ఎవరన్నా అమ్మాయి కనిపించిందేమిటీ.'

'అబ్బా. నోరు మూసుకు రా.' తలదువ్వుకుంటున్న సరోజ అలానే లేచొచ్చింది. 'చూడుచూడు'అంటూ ప్రక్కింటి శర్మగారి వాటాలోని మధ్యగదికేసి చూపించాడు.

అది శర్మగారి పడకగది. ఆయనింట్లో లేనప్పుడు వాళ్ళావిడ పొరుగింటి సమావేశాలకు పోతుంది.

నాలుగేళ్ళ పిల్లలూ అక్కడచేరి ఆడుకుంటారు, అల్లరి చేస్తుంటారు. ఈ వేళ ఇద్దరే పిల్లలున్నారాగదిలో. వెంకట్రావు మూడేళ్ళకూతురు బేబీ.... దానిమీద నిలువుగా ....పడుకుని... శర్మగారి నాలుగేళ్ళ కొడుకు డుంబూ....॥

ఇద్దరూ- కదలటంలేదు....।

ఇది చిత్రంకాదు. ఇది విచిత్రంకాదు....ఇది సృష్టిలోని మహోన్నత శక్తి' జీవరాశి అనురక్తి! కళ్ళ ముందున్న సత్యాల్ని కూడా కనిపెట్టలేని దివాంధులం. కనుకనే భూమిగుండ్రంగా ఉందని తెలుసుకోవటానికి క్రీస్తుపూర్వం అయిదువేలూ- క్రీస్తుశకం రెండువేల ఏళ్ళు కావలిసొచ్చాయి.

ఆపిల్ కాయ రాలితే నోట్లోవేసుకుందాం అనుకునే వాళ్ళమేకాని 'ఆకర్షణ శక్తి ఎక్కడిది' అని ప్రశ్నించటానికి న్యూటన్ పదిహేడు శతాబ్దాల తర్వాత పుట్టాల్సొచ్చింది.... ప్రకృతిని చూసి 'ఎందుకు' అని ప్రశ్నించినవాణ్ణి నిలువునా ఉరితీసిన చరిత్ర మానవులది....

నిన్నగాక మొన్న మనిషిని మనిషి ప్రేమించినందుకు నడిరోడ్డులో శిరస్సు ఖండించిన అరేబియాను సోదరదేశంగా చెప్పుకుంటున్న సంస్కృతి ప్రపంచానిది....

నల్లవాణ్ణి కాకవని శెభాసుగా ప్రకటించి చలామణి అవుతున్న తెల్లవాడిదీ రాజ్యం..!

'నీ గుండెను చీల్చి ముక్కలుగా చేసి, వేయించి నాకుపలహారంగా పెట్టు....నంజుకు నీ నాలుక కోసిస్తావా' అని అడగ్గల సంస్కారం మానవాళిది....

సత్యాసత్యాలతో నిమిత్తంలేదు. స్వార్ధమే సత్యం... స్వార్ధమే శాస్త్రం.... అజ్ఞానమే మా తపస్సు.... అంధకారమే మా రోచిస్సు....

అనుకునే జనం అపారంగావున్న లోకంలో భాస్కరం చూపించిన చిత్రానికి సరోజ పరమ మూర్ఖురాల్లా 'రియాక్ట్' యిందంటే ఆమె తప్పు కాదు.

"భార్యకు నిత్యం మొండితనం ఉండాలి.. మొగుణ్ణి తెగనాడుతూ వుండాలి.... వాడికి నోబుల్ ప్రయిజొచ్చినా చవటలానే చూస్తుండాలి.... అమెరికాకు రాయబారినయ్యాను దేవుడో అంటే....రానూపోనూ ఖర్చులిస్తారో,లేదో' కనుక్కోమనాలి.'

ఈ అణాకానీ ప్రజాస్వామ్యం ఆడవాళ్ళు అనుభవించినంతకాలం మొగుళ్ళు సిసలైన స్వాతంత్ర్యంలో మునిగి తేల్తూనే వుంటారు.

చదువుకున్న ఆడాళ్ళుకూడా భార్యస్థానాన్ని ఇంత దారుణంగా దుర్వినియోగం చేయబట్టే. భాస్కరం చూపించిన సన్నివేశం 'బూతుబొమ్మ' అనిపించింది సరోజకు..!

ఒక్కక్షణం దిగ్భ్రాంతి చెంది....

'ఉండండి-వెధవల్ని తన్నొస్తాను..' అంటూ వెళ్ళబోయింది.

'ఆగాగు.. ఆ తన్నటం ఎప్పుడో వాళ్ళమ్మా నాన్నలు చేస్తారుగాని.... అదేమిటో చెప్పగలవా. వాళ్ళకేమైనా తెలుసుననుకుంటున్నావా.'

'ఏముందందులో-వెధవలవాట్లు....చిన్నప్పుడే మొదలు. నాలుగు వడ్డిస్తేసరి.'

భాస్కరం తన భార్య ఔన్నత్యానికి చాలా సిగ్గుపడిపోయాడు.

'రేప్పొద్దున నీకు పుట్టబోయేవాళ్ళయినా అలాగే చేస్తాయ్'

'ఎందుకు చేస్తారు. అచ్చం ఓ లక్షణాలొస్తే తప్ప....'

భాస్కరం కించిద్విచారించి.

'ఆ పిల్ల నీ ఆదర్శ పురుషుడు వెంకట్రావు కూతురేగా' అన్నాడు.

వాళ్ళమ్మ లక్షణం వచ్చింటుంది.'


'ఏం పాపం ఇందిర ఏం చేసింది?!

'అలంకరించుకుని రోడ్డుమీదకు చూస్తుంటుంది కదా.... పిల్లలున్నారని చూడకుండా పగలూ రాత్రి ప్రణయం సాగించుటుంది.'

దానికి తెలిసిపోయింది!

"ఏమిటీ, ఇందిర రాత్రీపవళ్ళూ ప్రణయం సాగించిందా? వెంకట్రావు పాపం చాక్లెట్ తింటున్నాడా లేక యోగాసనాలు వేస్తున్నాడా?"

"ఏమో ఆ పిల్ల అమ్మ పోలికలానే కన్పిస్తుంది".



చెంపమీద ఛెళ్ళుమని కొట్టి "మాటలు అర్థవంతంగా పలుకు" అందామనిపించింది భాస్కరానికి.

పాముకన్న, తేలుకన్న, హిట్లరుకన్న, ముస్సోలినీకన్న వంచకుడికన్న, కంచరగాడిదకన్న మూర్ఖుడు / మూర్ఖురాలు హీనుడనిపించింది.

మూర్ఖత్వం పరమ నికృష్టం అనిపించింది.

"తివిరి యిసుమున తైలంబు తీయవచ్చు" అన్నాడు సూత్రకారుడు.

సుందర సరోజాల గురించే....

కొట్టీ తిట్టే లాభంలేదు, కోతి సారాత్రాగినట్లవుతుంది కీలెరిగి వాతపెట్టాలి.

బండరాయికే పాఠంచెప్పి బుద్ధిరూపించాలి. తిట్టడంలో లేదు గొప్పతనం, రోగాలకు మందు కనిపెట్టడందో ఉంది పనితనం అని భావించేరు. మాట్లాడకుండా గదిలోకిపోయి పడుకున్నాడు.

## 8

ఆ మర్నాడు-

"బాత్‌రూమ్‌లో కాలు జారింది. వెన్నుపూసలో నెప్పి. డాక్టర్ విశ్రాంతి పుచ్చుకోమన్నాడు" అంటూ అంటూ భాస్కరం మందుబిళ్ళలు మింగటం ఆరంభించాడు.

ఆ మందులు పెలిన్, కేల్షియం సాండక్, 'బి' విటమిన్, కాంపోజ్‌వంటి నిరపాయకరాలని సరోజ గమనించలేదు.

రెండ్రోజులు గడ్డంగీయటం మానివేశాడు. సరోజ చూపినప్పుడల్లా "అబ్బా-అమ్మా" అంటున్నాడు.

సరోజకు కడుపులో దుండగీడు కదుల్తున్నాడు. ఆ దుష్కార్యానికి బాధ్యుడు తప్పించుకు తిరుగుతున్నాడు. తనకేం పాలుపోవటంలేదు.



ఇంకొక్క ఇలాంటప్పుడు రోజా—

"బాబిగా, లోన గొడవచెయ్యకు నాయనా. నీకోసం సేవింగ్స్ బాంక్‌లో ఎకౌంట్ తెరిచాం. ఓ అరడజను ఉగ్గు గిన్నెల కార్డరిచ్చాం। ఓ వేయి గ్లాస్కోడబ్బాలు బ్లాకులో కొన్నాం. బ్లాకులో దాచాం. అమ్మగొట్టే యిబ్బంది పెట్టకు. కావాలంటే బైట కొచ్చినతర్వాత మా నెత్తినే ఒకటి పోద్దువుగాని" అంటుండాల్సింది పోయి భాస్కరం—

రాత్రి ఎనిమిదయ్యేసరికి మంచానికి తన్నిపెడుతున్నాడు.

ఇంగ్లీషు సినిమాలు చూసి అడక్కపోయినా అంతరార్థాలు వివరించే భాస్కరం. సినిమాకెళ్ళొచ్చిన రోజు "ఎంత ఖర్చయిందీ, సీట్లలో నల్లులున్నాయేమిటీ, సరోజా అన్నంలో ఆవకాయేసుకో.... నీకసలే నోరు సయించదు" అంటూ అడ్డదిడ్డం కబుర్లు చెబుతున్నాడు.

సరోజ కొళ్ళుమండుతుంది ఈ చెత్త వింటుంటే।

చేసేదిలేదు. ఆడపిల్ల. ఆ రోగం నిజమో - అబద్ధమో ఋజూలుండవు।

"నడుం నొప్పట - నడుంనొప్పి.విరగ్గొడితే బావుణ్ణు" అనిపిస్తుంది కాని మార్గాంతరం లేకపోతుంది.

రోజూ పాములా చుట్టేసి పడుకుంటుంది।

పట్టువదలని విక్రమార్కుడు ప్రవరాఖ్యుడిలా 'పోనీ మంచం చాలటంలేదేమో. సరోజా- పడకమంచం వేసుకోనేమిటీ' అంటున్నాడు.

రెండు వారాలు గడిచాయి.

సరోజకు సహనం కాలంకంటె తొందరగా తగ్గిపోతుంది- ప్రతిదానిమీదా విసుక్కుంటుంది.

మధ్యమధ్య భాస్కరం వెధవ కబుర్లు।

జ్యోతి చీరె కొనుక్కుంది.

ఇందిర బొట్టుపెట్టుకుంది.

హేమమాలిని పెళ్ళి చేసుకోనని ఒట్టుపెట్టుకుంది అంటూ ఆడ ఊసులు చెప్పటం మరీ చికాకనిపించింది.

"మాట్లాడకండి" అందామా పలుక్కుంటా బంగారమైపోతుందేమో.... కావాలని చేస్తున్నాడు. కక్షబూనాడు అని గ్రహించేసింది సరోజ.

## 9


ఈమధ్య వెంకట్రావు అంత తరచుగా సాయంసమా వేళాలకు మేడమీదికి రావటంలేదు.

భాస్కరానికి కారణం తెలియలేదు. "తనస్నేహంలో చెడిపోతున్నాడని" కాని ఇందిర అందేమో. ఆత్మప్రబోధమో, అర్ధాంగి ప్రబోధమో అర్థంకాలేదు. కొన్నాళ్ళుపోయింతర్వాత ఓరోజు జీపుదిగి పైకి వెళుతూ భాస్కరం "వెంకట్రావుగారూ మాట, ఓమాటు పైకిరండి" అని కేకేశాడు.

సరోజింకా ఆఫీసునుంచి రాలేదు. భాస్కరం చేతిలో ఏవో పేపర్లున్నాయి.

బట్టలు మార్చి, లుంగీ కట్టుకుని దినపత్రిక చూస్తూ కూర్చున్నాడు.. స్నేహితుడి రాకకోసం చూస్తూ.

వెంకట్రావు అప్పుతెచ్చిన నవ్వు అతికించుకుని పైకొచ్చాడు.



'రండి, కూర్చోండి-' భాస్కరం.

'కాగితాలేమిటి?' కూర్చుంటూ వెంకట్రావు.

'ఏవో ఆఫీసు కాగితాలు. మీకో బొమ్మల పుస్తకం చూపిస్తాను. చూస్తారా?'

'బొమ్మల పుస్తకమా..'

'మరే ఇలాంటివి చూసే వుంటారనుకోండి - మళ్ళీ చూస్తారేమోనని.' అంటూ అట్టమీది బొమ్మ అర్థభాగం చూపించి మళ్ళీ కాగితాలమధ్య పెట్టేశాడు.

వెంకట్రావు ముఖంలో రెండు బల్బులు వెలిగాయి.

'అబ్బే- ఎప్పుడూ చూళ్ళేదండి.'

'అమ్మ-నేనన్నమ్మను....' భాస్కరం.

'నిజమండీ ఒట్టు....' ఆతృతగా వెంకటావు.

'అయినా ఒద్దులెండి....చూడని వాళ్ళను చెడగొట్టడమెందుకు.. ఇవాళ పేపరుంది చూడండి'.

'అంటే కొన్ని చూశాను కానండీ.... ఏవో పిచ్చి దేశవాళీ పుస్తకాలండీ.... ఇదేదో ఫారిన్ జర్నల్‌లా వుంది.' వెంకట్రావు కరిగిపో నారంభించాడు.

భాస్కరం అట్టమాత్రం పూర్తిగా చూపించి 'ఒద్దండీ బాబూ, మీ ఆవిడకెటూ చెబుతారు. ఆవిడ నన్నెంత నీచంగా అనుకుంటుందో?'

'అబ్బే- ఎప్పుడలా చెప్పనండి.... అసలు మీకు తెలియదు. ఆవిడకు మీరంటే ఎంత గౌరవమో.'

'ఎంత గౌరవమేమిటి?'

"ప్రతిసారీ మీ పోలిక తెస్తదండీ. చంపేస్తది. ఆయనలా మీరు చదివారా. ఆయనలా మీరు రాయగలరా. మాట్లాడగలరా" అంటూ మొగుడంటే అలా వుండాలంటుందండి".

భాస్కరం గుండెల్లో వెచ్చగావుంది....ఇందిర డెందంలో పందుదొరికినందుకేకాదు. మనస్తత్వవేత్త ఉటంకించిన మూడో దశనుంచీ వెంకట్రావు మొదటి దశకు పడిపోతున్నందుకూడా.

ఒక్క బొమ్మల పుస్తకం చూడాలనే స్వార్థంకోసం 'అహం' వదిలి "మా ఆవిడకు మీరంటే యిష్టం" అంటున్నాడు.

ఎంత చంచలం మనస్సు! ఎంత బూటకం దాని తత్త్వం! పిడకలమేడలా ఎంత బలహీనమీ అంతరంగం!

భాస్కరానికి పేపర్లో నంబరు ఫస్టు క్లాసులో కనిపించినట్లుంది. పుస్తకం గట్టిగా పట్టుకుని-

"నిజంగా" అన్నాడు.

"నిజమేమిటండీ బాబూ - మొన్న పిక్నిక్‌కు పోయినప్పుడు వందసార్లంది. భాస్కరంగారుకూడా వస్తే బాగుండేదని. మీ కబుర్లెప్పుడూ వినలేదట. తీసుకురాకపోయారా అని సరోజాగార్ని పదిసార్లడిగింది."

ఆవేశంలో అమెరికావాడు న్యూట్రాన్ బాంబు రహస్యం చెప్పేస్తున్నట్లు చెబుతున్నాడు.

భాస్కరానికి తన భార్యనెప్పుడూ పరిచయంకూడా చేయలేదు వెంకట్రావు. చేయాలనిపించలేదు.

"తాను పెద్దగా చదువుకోలేదుగా" అన్నది సాకు!

"తాను ముద్దుగా ఉంటుందిగా" అన్నది లోన చికాకు.

అట్లాకాక వాళ్లావిడ ఏ వెర్రిపీనుగలానో వుంటే భాస్కరంతో రాత్రింబవళ్లు తన పడగ్గదిలోనే పేకాటాడుందేవాడు!

ఎంతయినా అందం ఆస్తికదా!

భాస్కరం పుస్తకంలో ఓ చిన్న బొమ్మ. కొద్దిగా చూపించి.... ఏం గమనించనట్లు.

"నా కథలమీద ఇందిరగారి అభిప్రాయమేమిటో" అన్నాడు. రారా, ఇంకా ముందుకు రా అని పిలుస్తున్నట్లు.

"చాలా బావుంటాయని నాతో చచ్చేటట్లు వాదించిందండి బాబు. సరోజగారి కథలు నచ్చవనికూడా చెప్పాను. ససేమిరా ఒప్పుకుంటేనా. వాళ్ళూళ్ళో ఇలాంటివి బోల్డు జరిగాయట. మన పనిమనిషి ఏడుగురుపిల్లల తల్లి అప్పలకొండతో వచ్చేయలేదా. వచ్చి మళ్ళీ యిద్దర్ని కనలేదా మన పాలపిల్ల తండ్రికి వాళ్ళమ్మ రెండో పెళ్ళాంకాదా. ఈ పిల్లలు తండ్రి అతను కాదనీ, మొదటి భర్తనీ అందరికీ తెలియదా' అంటూ పెద్ద చర్చ లేవదీసిందండి. ఇవన్నీ విని నాకు మతిపోయిందండీ".

అతను ఇంత వేగంగా, స్పష్టంగా, కంచె తీగమీద నుంచి ఓ ప్రక్కకు దిగి మాట్లాడటం ఇదే మొదటిసారి రతీదేవి చిత్రపటాల్లోకూడా అంత బలం వుందికాబోలు. భాస్కరం

## అసంభవం

చీకటిలో చిరుదీపం
వెలిగితే
వూదేసి ఆర్పేస్తారు.
ఒక వీధిలో మంట మండితే
అగ్నిమాపక దళాలతో
ఆర్పేసి అంతం చేస్తారు.
మరి అడివంతా అంటుకున్న రోజు
ఆర్పడం వీళ్ళ తరమా?

—వంగవండు అశోక్ కుమార్

పుస్తకంలోని మధ్య పేజీ అనాలోచితంగా చూపినట్లు చూపి మడిచేసి:

"నిజంగా నాకో ఉత్తమ పాఠకురాలు మా యింటి క్రిందే వుందని నాకు తెలియదండీ?"

"పాఠకురాలేమిటి - అభిమానురాలే. ఏదండీ ఒక్కసారి చూడనివ్వరా. ఏం ఫొటోగ్రఫీ అండి. బొమ్మలా మనుషులా అనిపిస్తున్నాయి. ఇంతకుముందిలాంటివి చూళ్ళేదండి".

"పోన్లెండి - చూద్దురుగాని చూసేంచేస్తారో చెప్పరా'.

"ఏంటండీ భాస్కరంగారూ - ఏంచేస్తారండీ ఎవరైనా. నా నోటితో చెప్పించాలని కాని"

"చెప్పందేమాత్రం యివ్వను - పోనీ మీ ఆవిడకాక ఎందర్ని తాకారో చెప్పండి?'!

"అబ్బ ఏంచేస్తామండి. మీరు మరీనూ. ఎప్పుడో చిన్నప్పుడండీ"-

"ఆ-చిన్నప్పుడు" అని పుస్తకం వెంకట్రావు చేతికివ్వకుండా చూడనిస్తున్నాడు భాస్కరం. బొమ్మలు! కనీ వి.. ఎరుగని భంగిమల్లో బొమ్మలు!

వెంకట్రావు పసిపిల్లాడైపోయాడు. పశువైపోయాడు.

అయోమయస్థితి! చూస్తున్నదే వాస్తవం. ఏదో లోకం ఈ లోకం అబద్ధం. ఆ లోకం బావుంది, ఇంకా బావుంటుంది

ముగ్గురు పిల్లల తండ్రి, నాలుక్కాళ్ళ జీవి అయిపోయాడు.

పడ గవిప్పిన చూపు!

ఒంట్లో నెత్తురంతా ముఖంలో వరదలాగా ముంచెత్తుతున్న వైనం. పేజీలు తిరుగుతున్నాయి!

పెంచుకున్న కండరాలు తగలడిపోయి, ఎముకల నుసి మిగుల్తున్న వేడి. పెరుగుతున్న నాడి.




"చిన్నప్పుడేంచేశారు?"

"మా క్లాసుమేటు అమ్మాయితోనండీ"....

"ఉహూ. ఇంకా ఎవరైనా"....

"మా మామయ్య కూతురూ నేనూ"....

"ఎక్కడా?"

"మా అత్తయ్య పిడకలు తీయమంటే ఆ గూట్లో"

"అంతేనా?"

"అంతేనండీ. ఫొటోగ్రఫీ చూడండి. వీళ్ళంతా ప్రాస్టిట్యూట్స్ అయ్యుంటారుకదండీ"

"అయ్యుంటారు. ఆ గూట్లో ఎంతసేపున్నారు?"

"కూసేపేనండి. మా అత్తయ్య పిలుస్తుందని భయం."

"మరేంచేసేవారు?"

"రోజూ ఆవిడ అడక్కపోయినా పిడకలు తీసేవాళ్ళమండి. ఓ రోజు చూసేసింది."

"చూసి?"

"ఏం అన్లేదండి. మళ్ళీ ఆ మాటే ఎత్తలేదు."

"ఆ పిల్లతో అందేమో?"


"తనతోనూ అనలేదటండి తర్వాత అడిగాను."

"ఎంచేత?"

"ఏమోనండి. ఆతర్వాతమాత్రం ఆవిడే పిడకలు తీసుకునేది."

"అహ-మళ్ళీ మీరెప్పుడూ?"

"అబ్బె-మావూరొచ్చేశానండీ. ఇది చూడండి- అబ్బ పర్వర్షన్ కదండీ"



"పర్వర్షనే"

"వాళ్ళకు సిగ్గూ అవీ ఉండవా అండీ-"

"ఉండవు" భాస్కరం।

"ఇది మరీ నేస్టీ. ఇలా జరుగుతాయేమిటండీ?"

"జరుగవు" సీరియస్‌గా.

సరోజ మెల్లెక్కుతున్న చప్పుడయ్యింది। వెంకట్రావు వులిక్కిపడ్డాడు.

"సరోజగారొస్తున్నారు. దాచెయ్యండి."

"దాచటమెందుకూ. తనుకూడా చూస్తుంది."

"అమ్మబాబోయ్. దణ్ణంపెడతాను దాచేయండీ."

"పర్వాలేదండీ. ఈ బొమ్మల్లో ఆడవాళ్ళులేరూ."

ఒకటి-రెండు - మూడు - దశలు.

మూడు - రెండు.... ఒకటి.... దశలు.... దిశలు.

మళ్ళీ ఒకటి నుండి పైకి దశలు. దిశలు.

నమస్కారమండి బాబో. ఏమనుకుంటుంది. దాచెయ్యండీ"

వెంకట్రావే లాక్కొని దాచేశాడు.

సరోజ "ఏమిటండీ" అంటూ వచ్చింది.

"ఒంట్లో వేడి" అన్నాడు భాస్కరం.

"అవును. ఎండ. ఎండ" అన్నాడు వెంకట్రావు చాల కష్టపడుతూ.

సరోజా-వెంకట్రావులు ముఖముఖాలు చూసుకున్నారు.

## 10

ఆఫీసులో జ్యోతి భాస్కరంల ప్రేమాయణంమీద కథలు చెలరేగాయి. గుమస్తాలు ఒకటే గుసగుసలు.

"భాస్కరరావుగారు భార్యకు విడాకులిచ్చి జ్యోతిని పెళ్ళి చేసుకోబోతున్నారట!"

మొన్న బీచ్‌లోనూ, అటుమొన్న ఆఫీసులోనూ అందరికళ్ళముందూ పడ్డారట."

"ఆయన కథల్లో రాసిందే అది కనుక - పెళ్ళాన్ని వదిలేయటంలో ఆయనకు తప్పులేదట."

శాస్త్రి కాలికి బలపంకట్టుకుని సెక్షన్లన్నీ తిరిగి చెప్పొచ్చాడు.

రోలింగు గుర్నాధం పైపుకొట్టి సర్క్యులేట్‌చేశాడీ వార్తను- అందరూ తన పెళ్ళాంలా అయితే అన్నట్లు.

వీళ్ళ కేసుకు బలమైన సాక్ష్యాలు కూడదీశారు.

రెండ్రూపాయలు పుచ్చుకుని సినిమాకు పోయి జ్యోతి భాస్కరంలకు ఏకాంతం కల్పించినట్లు ప్యూన్ అప్పారావు వాఙ్మూలం।

ఇటీవల సరోజాదేవి భాస్కరాన్ని కాదని ప్రక్కింటి ఆయనతో పిక్నిక్‌కు వెళ్ళిందని తెలుసుకున్న క్లర్కేశ్వరుడాకందు రెండో సాక్షి।

భాస్కరరావుగారు తరచు తనఫ్లాస్కులో కాఫీ అలానే వుంచి జ్యోతి ఫ్లాస్కులో కాఫీ త్రాగుతున్నారట.. కనుక కిందపడిన భాస్కరరావు ఫ్లాస్కు మూడో సాక్షి।



భాస్కరరావుగారుండే మేడక్రింది వాటాలోని బ్యాంక్ కాషియర్ వెంకట్రావు అనబడేవాడు సదరు సరోజాదేవితో చాలా చనువుగా ఉంటాడట. ఈ విషయంగూర్చి భాస్కరం గార్కి భార్యమీద అనుమానమట. ఇది కోర్టులో క్రాస్ ఎగ్జామినేషన్‌లో తేలవలసిన విషయం. ముద్దాయి నోటిద్వారా రావాలితప్ప వేరే సాక్ష్యాధారాలు లేవు.

ఈ కేసు విచారణ గంటకో వాయిదాపడుతూ నడుస్తోంది ఆఫీసులో.

జ్యోతి సాక్ష్యంకూడా యివ్వను తన్నుకు చావండంది!.

భాస్కరం వినీ వినట్లూరుకున్నాడు.. 'ప్రేమ ప్రారంభించటంతేలిక. ముగించటం కష్టం' అన్న మాటలు గుర్తొచ్చాయి.

అతన్నొకటే బాధించిన విషయం... పూర్వాశ్రమంలో జ్యోతితో సంబంధమున్న వాళ్ళు మాత్రమే కేసులో వకీళ్ళు కావటం... లేని వాళ్ళు... ఎవరి బాధలు వారివి. అనటం..

భాస్కరానికి సంఘంలోని 'మంచి' తనంమీద చాలా గౌరవం ఉంది. తను మంచివాడో కాదో తేల్చటం ఇప్పుడు సాధ్యం కాకపోవచ్చు ..

అలాంటి మంచివాళ్ళకు స్త్రీలంటే గౌరవముంటుంది. ఇవ్వాళ్టి వరకు 'ఈమె నీ తోడబుట్టువు లాంటిది'... అంటే అలాగే చూడగలరు.. అలాకాదు. కొన్ని కారణాల వల్ల నీవీపిల్లను పెళ్ళిచేసుకోవాలి.. రేపట్నుంచి నీ భార్య అవుతుంది .... అంటే అలాగే జీవించగలరు...

సంఘంలోని అనేక భావాల్ని జీర్ణించుకునే సహనం వుంటుంది వాళ్ళలో... తాము శుద్ధంగా ఉంటూ, అలా లేని వాళ్ళను ఆక్షేపించని ఆదరణ స్వభావం ఉంటుంది..

'లోకంబులు, లోకేశులు లోకస్థులు గడచిన పిదప.... ఏముందో.. ఏది ధర్మమో ... ఏది అధర్మమో.. తొందర పడి మన మెందుకు తీర్పు చెప్పెయ్యాలి.... అన్నతత్వం వాళ్ళది..

వాళ్ళకు లోకంలో నేరస్తుల్తో పనిలేదు.... కూడూ, గుడ్డా ఆరోగ్యం, విద్యా.... ఆయుష్షూ... అందరికీ లభించాలని చిత్తశుద్ధిగా కోరుకుంటారు. వాళ్ళు...

పతితను సైతం పల్లెత్తి మాటనని గుణవంతులు-! అల్గుటయే ఎరుంగని అజాత శత్రువులు..- సంఘంలోనిమంచికీ చెడుకీ చివరితీర్పు వాళ్ళదే.. ఈ దేవుళ్ళవల్లే ఏమార్పుగాని, సంస్కరణకాని. సంఘంలో రాగల్గుతుంది...

సానితనాన్నీ, సహగమనాన్నీ వాళ్ళే ఆపగలరు.. ఈ అస్తవ్యస్త బ్రతుకుల మీద కుళ్ళులోకం ఆఖరి వాక్యం పలికేయకుండా వాళ్ళే అడ్డగించగలరు..

ఒక సరోజ చేత నిజం ఒప్పించగలరు..


ఒక జ్యోతిని మన్నించగలరు..

ఒక భాస్కరాన్నిపట్టి చూచి తూకం చెప్పేయగలరు...

ఆత్మవంచన ఇక ఆపెయ్యండని ఫర్మానా ఇచ్చెయ్యగలరు..

అందుకే భాస్కరానికి తన 'ఆత్మ' కంటే లోకంలోని ఈ 'మంచి' అంటే మహా దొడ్డభయం!

జ్యోతి 'అందంగా వుంటుంది.' అంటె 'పోన్లెండి..' 'పాపం మంచిపిల్ల' అనే తెల్లచూపు వాళ్ళంతా కేసులో సాక్ష్యలివ్వటానికి తిరస్కరించారు...



వ్యక్తిగా భాస్కరం మీద గౌరవం ఉన్నవాళ్ళంతా 'ఆయనిష్టం.. మీరెవరు అడగటానికి..' అన్నారు..

భాస్కరం ఓ శుభముహూర్తాన శాస్త్రినీ, జ్యోతినీ పిలిచాడు...

శాస్త్రికి కుక్క బిస్కట్ పారేసి. జ్యోతితో తనముందే పరాచకాలాడాడు.. జ్యోతి మనస్సు ఇంతింతై, వటుడంతై, శాస్త్రి మీద కక్ష తీర్చేంతై భాస్కరం చేతిలోని కాగితం చెయ్యిపట్టుకుని మరీలాగింది... శాస్త్రి గుడ్లప్పగించాడు..

భాస్కరం తమాయించుకుని.-

చూడండి శాస్త్రిగారూ, నెక్స్టమంత్ ప్రమోషన్స్ యివ్వాలి... సీనియారిటీ, మెరిట్ రెండూ చూడమన్నారు మేనేజ్ మెంట్. సర్వీసు రిజిష్టర్లు తీసుకొండి...

మీరూ, జ్యోతీ కలిసి లిస్టులు తయారుచెయ్యండి... ఇహనుండి మీయిద్దరి సీట్లూ నా 'ఏంటీ రూమ్'లో.... వెళ్ళండి...." అన్నాడు...

'చిత్తం' అన్నాడుశాస్త్రి మహదానందంగా. శాస్త్రి వెళ్ళబోతుండగా భాస్కరం..

'శాస్త్రిగారూ మాట. ఈ విషయం హైలీ కాన్ఫిడెన్షియల్ .. సీట్లు మార్చటానికి కారణం ఎకౌంట్ షీట్ తయారు చేస్తున్నందుకు అని చెప్పాలి---- మన ముగ్గుర్నీ దాటితే ఈ విషయం కాంప్లికేటెడ్ అవుతుంది. ప్లీజ్ బి కేర్ ఫుల్...'

'చిత్తం... చిత్తం...' శాస్త్రి.

అంతే..। ఆ మర్నాడే...

"సాక్ష్యాధారాలు సక్రమంగా లేనందున, కొందరు సాక్షులు ఎదురు తిరిగిందున, ముద్దాయిలు ఏ పరిస్థితుల్లో నేరం చేస్తారో రుజువుకానందున, ప్రాసిక్యూషన్‌వారు నేరంస్వరూప స్వభావాలేమిటో ఇతమిత్థంగా తేల్చనందున కేసుకొట్టి వేయటమైనది."

అని ఉన్నత న్యాయంస్థానం తీర్పిచ్చారు. అంతరంగిక గదిలోకి వెళ్ళేశాస్త్రి భాస్కరానికి ప్రతిక్షణం విష్‌చేస్తున్నాడు!

వెనుక నడుస్తున్న జ్యోతి కొక్కిరిస్తుంది.

## 11

పగలల్లా టెన్నిస్ బంతిలా గెంతే భాస్కరానికి రాత్రి తొమ్మిది దాటేసరికి సడన్‌గా నడుంనొప్పి రావటం నాటకం తప్ప అన్యంకాదని పూర్తిగా గ్రహించింది సరోజ. అతను వాడే బిళ్ళలు రెండునోట్లో వేసుకుని కూడాచూసింది.. పుల్లగా, తియ్యగా వున్నాయి! ఆ రోజు రాత్రి నిలవేసింది.

'చెప్పండి, ఎందుకీనాటకం? నాపై కక్ష సాధించాలనా. లేక కావలసినవన్నీ ఆఫీసులోనే దొరుకుతున్నాయి..ఈ కడుపుతోన్న దానితో పనేమిటనా, మీరు నిజాయితీపరులుగదా.. చెప్పండి.'

పైన చల్లని వెన్నెల.... క్రింద మెత్తటి పరుపు.... ఒకప్రక్క కొబ్బరాకుల తళతళలు. మరోప్రక్కతలంటుపోసుకుని, జుట్టు విరబోసుకుని, ఉల్లిపొరలాంటి తెల్లటిచీరెలో సరోజ.।

పరిచయమున్న సరోజ తగుల్తుంటేనే ఎంత బావుంది!

సరోజను చూస్తుంటే ఉపవాసం మానేసి, నాటకం ముగించి ముందుకురికేద్దునా అనిపించింది.

'చెప్పరేం' రెట్టించింది.

'మరేంలేదు సరూ.. మంచికావ్యం ఒకటిరాస్తున్నాను..' 'నానృషిఃకురుతే కావ్యం' అన్నారుకదా.. అందుచేత బ్రహ్మచర్యం అవలంబించందే ఋషికాడుకదా.

భాస్కరం అబద్ధాన్ని నిజం కంటే హీనంగా చెప్పాడు. 'చాల్లెండి, వేళాకోళం.... పగలంతా జ్యోతితో చేస్తున్నారుకదా బ్రహ్మచర్యం.. ఇహరాయొచ్చు కావ్యాలు.'

సరోజ మీద దాడికి సిద్ధమయ్యాడు.. భాస్కరం ఇహ నాటకంలో చివరిఘట్టం ఆడేయటం ఉత్తమమనిపించింది.

'అవును సరోజా ఎంత కరెక్టగా ఊహించావ్.. నా భార్యవైనందుకు గర్విస్తున్నాను జ్యోతికాభావం ఉన్నమాట కూడానిజం.. ఈవేళ నాకు ప్రేమలేఖకూడా రాసింది.'

'ప్రేమలేఖ.... ఏదీ..'

'చొక్కా జేబులోవుంది.... చదువ్.'

సరోజ గబాగబా లేచివెళ్ళి లైటు వేసింది. ఉత్తరంతీసి చదవ నారంభించింది.

భాస్కరం బయట మంచంమీద చేతులు రెండూ తల క్రిందపెట్టుకుని ఆకాశం వంక చూస్తుండిపోయాడు.।


'ప్రియమైన భాస్కరంగార్కి.

ఇలా రాస్తున్నందుకు అన్యధా భావించకండి.... నా మనస్సులోని కోర్కె అణుచుకోలేక రాస్తున్నాను.... ఈ ఉత్తరం సరోజకు చూపించరని ఆశిస్తున్నాను.

ముఖ్యంగా మొన్న మనం పిక్నిక్‌కు వెళ్ళిననాటినుండి నామనస్సు నాలో లేదు

పిక్నిక్‌లో మిమ్మల్ని చేయిపట్టుకుని పిల్లకాలవ దాటించినప్పుడూ, నీళ్ళ పామును చూసి భయపడి నా మీదకు ఒరిగినప్పుడు-

ఎంత హాయిగా ఫీలయ్యానో వర్ణించలేను.





ఈ బ్రతుకులో ఏదోలోటుగా వుందని అప్పుడే గ్రహించాను.

ఇలా సిగ్గులేకుండా రాస్తున్నందుకు నన్ను ఎలాటిదనుకున్నా నా కభ్యంతరంలేదు. ఇంక దాచుకోవటం నావల్లకాక ఇలా చేస్తున్నాను. మీకిష్టంలేకపోతే ఈ ఉత్తరం చించి వెయ్యి ముక్కలు చేసి తగులబెట్టండి.

సరోజగారికి తెలిస్తే ఎంత నీచంగా భావిస్తుందో నా గురించి.. మీరు కలలోకి రావిరోజంటూ లేదు.

ఇది నిజం....నమ్మరూ.

మీ. జ్యోతి.

జ్యోతి దస్తూరి తెలుస్తూనే వుంది. ఉత్తరంచదివి బయటకొచ్చింది సరోజ. నాలుగు క్షణాలు గడిచాయి.

చందమామలోని మచ్చల్ని రాట్నంవడికే ముసలమ్మగా భావించి తీక్షణంగా చూస్తున్నాడు భాస్కరం.

'ఎప్పుడొచ్చిందుత్తరం.'

'చాన్నాళ్ళయ్యింది.'

'మరి నాకు చూపించలేదేం.'

'ఎంతతేలిగ్గా అడిగింది సరోజ' అనుకున్నాడు. భాస్కరం.

సరోజ వంక ఒక్కసారి విసురుగా చూసి.

"అదేమిటీ. నీకు చూపించటందేనికీ" తగాదా కొని తెచ్చుకోనేమిటీ. ఇప్పుడైనా నేనుగదా నీకు చెప్పింది".

"ఇంకేం. ఏం రాసారు జవాబు. రాయటమెందుకులెండి? ఏ బీచ్‌కో, దాని గదికో పోయి కార్యాలన్నీ పూర్తిచేయకపోయారూ. చేసేవుంటారు."

గంభీరంగా చూస్తూ భాస్కరం "ఇంకా లేదు."

"అందుకేనా ఇంటిదగ్గరఉపవాసాలు."

సరోజమీద మొదటిసారి అసహ్యం వేసింది. మనిషపతనానికి ఎక్కళ్ళేని విచారం వేసింది.సరోజ మామూలు ఆడపిల్లకాకుండా. ఏదో ఊహాలోక ఆదర్శవనిత అయిపోవాలనీ కనీవినీ ఎరుగని కారుణ్యం. వివేచనా ప్రదర్శించాలని కానేకాదు.

పసిపాపలాంటి సరోజ ముందు స్వార్థం. తర్వాత అహంకారం. ఇప్పుడబద్ధం. పైగా మొగుడిమీదకు దాడికి క్షణాలమీద వెళ్ళిపోతుంది. ఆ ఉత్తరం ఏమిటో గ్రహించీ గ్రహించనట్లు.

తెలిసీ తెలియనట్లు ఆలోచన గాలికొదిలేసి అనుమానం ప్రత్యర్థులమీద నెట్టేసే సులభమైన పరిష్కారానికొచ్చింది! కనీసం తన మొగుడి "అతితెలివి"కైనా కాసింత ఆశ్చర్యపడి వెనకాడలేదు!

భాస్కరానికి సరోజమీదకోపం జాలిగా పరిణమించింది. ఈ జాలితో కాసేపు ఆడించి చూద్దామని నిర్ణయించుకుని-

సరోజను బలవంతంగా మంచంమీదికి లాక్కున్నాడు.

సరోజ అడ్డుచెప్పలేదు. సరోజ శరీర సౌందర్యం పైనున్న చందమామకూడా చూసేటట్లు చేస్తున్నాడు.

ఉత్తరందారి ఉత్తరంపోయింది. సరోజ బేషరతుగా లొంగిపోతుంది.

ఒక్క క్షణంలో క్రోధం, క్రౌర్యం అనీ ఎలా రాజీపడ్డాయి! అవసరం....అవసరంగనుక!

విలువలు....విలువలు! విలువల్లా మారకాయన్నాడు కవి! ఎప్పటికేది తనకుపయోగమో దానికి ప్రాధాన్యత యిస్తుంది మనస్సని చెప్పాడు తత్వవేత్త. ( Property of Values )

కోపం. భయం. కక్ష. కార్పణ్యం. కోర్కె ఏదైనా అంతే!

విలువలు....విలువలు

వీటికి సర్వకాలసర్వావస్థలయందు సామ్యప్రమాణాలేం లేవు.

"ఇప్పుడెలావున్నావో తెల్పా" సరోజ అందచందాల్ని ఆపోసనపట్టేస్తూ....

"యెలా వుంటేయేంలే, మీ హృదయమంతా నాది కానప్పుడు!"

తనక్కావలసింది ఈ రోజు లభించటం ఖాయమనుకున్న తర్వాత సరోజ తిరిగి యథాస్థితికి చేరుకుంటుంది. అప్పుడే....అక్కడే ఎంత అవకాశవాదం!"

భాస్కరం రెండు క్షణాలాలోచించాడు. ఇప్పుడు లొంగిపోతే, ఇప్పుడు జారిపోతే, సరోజకు మళ్ళీ పాఠం చెప్పటం పడదు. తప్పదు. ఈ బాధ భరించైనాసరే తనని శుద్ధిచేసి పారేయాలి.

భాస్కరం తమాయించుకున్నాడు. 'టచ్ మీ నాట్' ఆకుల్లా నరాలన్నిటినీ ఆర్పివేసాడు. పగ్గాలతో కట్టి మేకులు కొట్టేసాడు.

చటుక్కున సరోజను వదిలేసాడు!

"ఆగిపోయారేం?"

"నిన్ను రెండు ప్రశ్నలు వేయాలనుకుంటున్నాను. నువ్వు వాటికి సమాధానాలు చెప్పాలి. చెప్పందే నిన్ను నా సరోజగా స్వీకరించదల్చుకోలేదు."

ఈ హఠాత్పరిణామానికి కించిత్ బాధపడింది. తనన్న మాట అనకుండావుంటే బావుండేదనుకుంది: సరోజకు ఏడు పొచ్చేటట్లుంది.

"ప్రశ్నలు వింటావా."

".... .... .... ...."

"అయితే విను.?

తలెత్తి చూసింది ఏమిటడుగుతావన్నట్లు.

అలాంటి ఉత్తరం నీకొస్తే సంతోషిస్తావా లేదా?

ఈ క్షణంలో నీకేం కావాలి?

సరోజ "గీ" మని ఏడుపు లంకించుకుంది.

ఏడుస్తూనే లేచివెళ్ళి, బట్టలుకట్టుకుని, పయిట చెంగుతో ముక్కు తుడుచుకుంటూ వచ్చి మడతమంచంమీద పడుకుంది.

మధ్యమధ్య ఎక్కిళ్ళొస్తున్నాయి!

భాస్కరం ఓదార్చటానికి లేచాడు!

"ఏమిటి సరూ" ఏమయ్యింది. ధైర్యంగా చెప్పాలిగాని ఏడుస్తారా. మానెయ్. పిచ్చి సరూ. జ్యోతి నీకంటే అందంగా వుంటుందేమిటి. ఇంతదానికే ఎవ్వరూ లేనిది ఏమిటిదీ. ఏడ వకు బుజ్జీ."

సరోజ తల ఒళ్ళోకి తీసుకుని మడతమంచంమీదే తానుకూడా చోటుచేసుకున్నాడు.

సరోజ ఏడుపు తగ్గించింతర్వాత చుట్టూ చేయి వేసి మెల్లగా నిద్రలోకి జారుకున్నాడు!

## 12

నిద్రలో భాస్కరానికి చిత్రమైన కలొచ్చింది.

ఏదో పెద్ద ఉత్సవం జరుగుతుంది. జనం.... ఎక్కడ చూసినా జనం.. పందిళ్ళు.... మేళతాళాలు.. ఉత్సవమేమిటో సరిగ్గా తెలియటంలేదు.. మనుషులు.. మనుషులు . అయిన వాళ్ళు.. బంధువులు.. స్నేహితులు.. చిన్నప్పటి స్నేహితులు.

భాస్కరం జనంలోపడి ఎవరికోసమో వెతుకుతున్నాడు. సరోజకోసమా.. కాదు.. జ్యోతికోసం. జ్యోతి.. జ్యోతికోసం జ్యోతి.... అదుగో జ్యోతి.. ఎవర్నో పెళ్ళాడుతుంది జ్యోతి.. తనను చూచి ఒక్కపరుగున లేచొచ్చింది. పెళ్ళివాళ్ళంతా విస్తు పోయారు. అందరిలోనూ అంతధైర్యంగా పరుగు పరుగున లేచొచ్చింది జ్యోతి. పదిమందిలో తన మెళ్ళోదండ వేసింది. కావలించుకుంది.

గుండెలకు హత్తుకున్నాడు. ఇద్దరూ జనంనుండి విడి వడ్డారు. ఎక్కడికో పరుగులు.... జ్యోతి తన చేయి వదలటం లేదు. జ్యోతి చేయి ఎంతమెత్తగావుంది. ఆమె పెదవులు ఎంత తీయగా వున్నాయి. పారిపోతున్నారు. ఊళ్ళు. ఏళ్ళూదాటి ఎడారుల్లో పొదల్లో- పాములూ తేళ్ళూదాటి పారిపోతున్నారు. పడిపోయారు. ఓ గుంటలో పడిపోయారు. పడిపోతేనేంలే.. ఎంత హాయిగా వుందక్కడ. ఎవరూ చూడటంలేదు. ఉత్సవం చాలాదూరంగా వుండిపోయింది. ఎవరూరాలేరిక్కడకు. వచ్చినా తొంగిచూళ్ళేరు. చూసినా చీకట్లో కనపడరు. జ్యోతి ఎవరూ లేనిచోట. తనకోసం పదిమందిలో పరుగెత్తుకొచ్చిన జ్యోతి ఎప్పుడూ వీడిపోకుండా గట్టిగా నడుం పట్టుకున్న జ్యోతి.

వద్దు జ్యోతి-ఏం చేయొద్దు జ్యోతీ. మనమేం చేయొద్దు. ఇలానే వుండిపోదాం .బాగుందికదూ

తలూపింది జ్యోతి. ఒకటిగా- ఇద్దరూ ఒకటిగా అయి పోయిన తన్మయత్వంలో.... ఎంతో ఆనందం.... ఆనందం.... ఆనందం-ఇది నిజంకాదేమో-- కలేమో- అయితే అయిందిలే- గట్టిగా అనుకుంటే మెలుకువస్తుంది. ఇలానే ఉండనీ.... అదే మిటి-- వాళ్ళెవరు.

గుంటలో రెండో భాగం వుంది. అక్కడ సరోజ, వెంకట్రావున్నారు. వాళ్ళేం చేస్తున్నారక్కడ వాళ్ళు ఇలాగే వున్నారు. వాళ్ళింతకన్నా ఆనందంగా ఉన్నారు. ప్రణయంలో మునిగితేలుతున్నారు.

సరోజ చూసింది. కాని చూడనట్లు ముఖం తిప్పేసింది లెక్కచేయనట్లు.ఎంత నిర్లక్ష్యం. వెంకట్రావుతో ఎంత చను వుగా. ఎంత యిష్టంగా ఎంత పరిచయంగా.


వాడేమిటి వెంకట్రావుగాడు. పిల్లిలా తిరిగేవాడు. నీతో ఏమిటన్నట్లు చూస్తున్నాడు. ఇప్పుడు నీవేం చేయగలవన్నట్లు చూస్తున్నాడు.తనకు వెంటనే పోయి ఒకళ్ళ నుంచి ఒకళ్ళని లాగేయాలనిపించింది.


జ్యోతి 'మనకెందుకురా' అంటుంది. వెళ్ళబుద్దేయటం లేదు. ఆ శరీరం సరోజ శరీరం.

అవన్నీనాకు తెలుసన్రా బాగా పరిచయం. నాతోఅలాగే వుండేది.

ఇప్పుడువాడితో అలాగే అలాగే అలాగే నవ్వుతుంది. అలాగే చుట్టుకుంటుంది. అంతకన్నా యిష్టంగా ముఖంలో అంత యిష్టమేమిటి?

నీతో పనేమిటన్నట్లు చూస్తుంది.





జ్యోతి పిలుస్తుంది. మనంకూడా అలాగే వుందాంరండని విదిలించుకుంటున్నాడు.

వాణ్ణికొడితే కొడుతున్నారు. కర్రతో కొడుతున్నాడు కసితీరా బాదుతున్నాడు.

వాడికి దెబ్బలు తగలటంలేదు. నవ్వుకుంటున్నారిద్దరూ చెయ్యి పడిపోయిందికాని దెబ్బలు తగలటంలేదు.

ఇప్పుడేంచేయగలవన్నట్లు చూస్తున్నారు. భాస్కరం బాధ చూసి, చూసి సరోజే.

'ఎందుకలా కొడతారాయ న్నిజ్యోతి, జ్యోతి అని కల వరించారుగా.... ఆ గుంటలోనే చావండి' అని మళ్ళీ వెళ్ళి పోతుంది.

'ఇహ ఇక్కడొద్దు మనం' అని వెంకట్రావుని ఆ గుంటలోనుండి బయటకు తీసి మరోచోటకు వెళుతుంది,

'పోతే పోనీయండి' అంటుంది జ్యోతి.

పోనియ్యటం ఇష్టంలేదు భాస్కరానికి. వాళ్ళు అలాగే ఉత్సవంకేసి పోతున్నారు. 'సరోజ-సరోజ' అని భాస్కరం కేకలు. వినటం లేదు. వినిపించుకోవటం లేదు. వెళ్ళిపోతుంది నిర్లక్ష్యంగా. వెంటబడ్డాడు. పరుగు తీసాడు. దారి తగ్గటంలేదు నేల వెనక్కు పోవటం లేదు. వాళ్ళు వెళుతున్నారు- గాలిలోకి ఎగిరి నడుస్తున్నాడు- అర్జునుడిలా బాణాలు విసురుతున్నాడు.

మాయలూ, మంత్రాలూ ప్రయోగిస్తున్నారు. నేనడక. గాలిలో నడక, ఇంకా వేగంగా. ఇళ్ళమీదనుంచి. రోడ్లమీద నుంచి, నీళ్ళమీదనుంచి. చెట్లమీదనుంచి నడక. వాళ్ళందటం లేదు. దొరకటంలేదు,

భాస్కరానికి మెలకువ వచ్చింది, ప్రక్కన సరోజ నిద్రపోతోంది పైన చంద్రుడు అలసిపోయి ఓ ప్రక్కకు ఒరుగుతున్నాడు.

సరోజను గట్టిగా పట్టుకుని మళ్ళీనిద్రకుపక్రమించాడు.

## 13

తెల్లవారి ఏడయ్యింది.

శనివారం.

ఆఫీసులు మధ్యాహ్నంవరకే పనిచేస్తాయి. లేవటం ఆలస్యమైందని సరోజ తొందరతొందరగా వంటచేస్తుంది,

భాస్కరం కాఫీ పూర్తిచేసి తన గదిలో కూర్చుని నవ కోవ్ రాసిన "లొలితా" చదువుతున్నాడు. ఆ నవల్లో-

నలభై ఏళ్ళ తండ్రి సమానుడికీ పదేళ్ళ స్కూలుపిల్లకీ మధ్య ప్రణయగాథ, ఆ పిల్ల అతన్ని "ఫాదర్" అని పిలు స్తూనే వుంటుంది. ఇతడు తనదృష్టితో "ఎడ్వాన్స్"అవుతూనే ఉంటాడు,

ఆ అమ్మాయిని ఆడిగి, వేధించి. సెక్సుచేష్టల్తో రెచ్చ గొట్టి ఎట్టకేలకు 'సెడ్యూస్' చేసి లేవదీసుకుపోతాడు,

అమెరికాలోని పెద్దపెద్ద నగరాలన్నీ తిరుగుతారు, అత్యంతప్రీతిగా అతనూ, ఏమాత్రం యిష్టంలేకుండా కేవలం దినవారీచర్యగా ఈ పిల్లా "సంసారం" లాంటిదాన్ని కొంత కాలం గడుపుతారు,

ఆ తర్వాత కొంతకాలానికి "లొలిత" ఓ కుర్రవాణ్ణి ప్రేమించేసి, పెళ్ళిచేసుకుని చెప్పకుండా వెళ్ళిపోతుంది. ఆ కుర్రవాడు చాలాపేదవాడు, లొలితా గర్భవతికూడాఅవుతుంది. సంసారం గడవటంకూడా కష్టమవుతుంది, తిండికూడా సరిగా లేక....

ఇంకెవ్వరూ దిక్కులేని లొలితా అతనికో ఉత్తరం రాస్తుంది. ఆ ఉత్తరంలో డాడ్, ఇల్లు గడవటంలేదు డాడ్, నాలుగొందలు డబ్బు పంపు. నాన్నా డబ్బుపంపవూ" అని రాస్తుంది. ఆ వాక్యం చదివిన భాస్కరానికి ఏడుపొచ్చింది ఆ పిల్ల స్థితిచూసి.

కళ్ళనుండి రాలిన చుక్కలు పుస్తకంలోని ఆ ఉత్తరం మీద పడ్డాయి,

ఆ నవల అద్భుతమైందని ప్రపంచమంతా కీర్తించిన తర్వాత కొన్ని దేశాలు నిషేధించాయి।

అక్కడిదాకా ఎందుకూ ఒక మగడాక్టరుకీ, అతనిదగ్గర కొచ్చే స్త్రీరోగుల్లో కొందరికీ మధ్య "ఆకర్షణ" వుంటుందని రాసినందుకు కొమ్మూరి వేణుగోపాలరావు నవల "ఆకర్షణ"ను పెద్దలంతా ఆక్షేపించలేదూ?

దాచేస్తే దాగని సత్యాలుంటాయి. చేతనయితే ఆపి చూడండి. సత్యాల్ని మార్చి చూడండి. ఇది సత్యం అన్నవాడి మీద విరుచుకుపడిపోవటం అనాగరికత।

వెంకట్రావు "గురూగారూ" అంటూ భాస్కరం గదిలోకొచ్చాడు.

సరోజ వంటింట్లో ఉంది.

అతను "గురూగారూ" అనిపిలవటం ఇదే మొదటిసారి.

ఈ రోజుల్లో "గురూగారూ" చాలా తేలికైన పిలుపు. అందులో గురుత్వం ఏం ఉండనక్కర్లేదు. కాని వెంకట్రావు అలా పిలవటంలో కొత్తర్థంవుంది. అలా అని భాస్కరాని క్కూడా స్ఫురించింది.

"ఠండ"న్నట్లు నవ్వుతూ వెంకట్రావువంక తీక్షణంగా చూసాడు భాస్కరం. "రాత్రి ఏంచేసావురా, రాస్కెల్"అన్న ట్లుందా చూపు.

# అనాథ బాల్యం

ఎవరో పారేసిన చాక్‌లెట్ కాగితాల్ని చప్పరించే
బాల్యం
ఎంగిలి విస్తరి మెతుకుల్ని దొంగగా తినే బాల్యం
తల్లికోసం వెతుక్కునే నిరంతర బాల్యం
అస్థిపంజరంలో మూగగా అనాథ బాల్యం

రైల్వే స్టేషన్లలో
తనను చూస్తూనే సామాను జాగ్రత్త చేసుకునే మనుషులు
పెద్దపెద్ద గేట్లవెనుక తనకోసమే కాచుకున్న కుక్కలు
భయంతో కేకేసి రోడ్డుమీద పడ్డప్పుడు
లేవనెత్తటానికి వెనకాడే చేతులు

ఆకలిలో మిట్ట మధ్యాహ్నం అరిగిపోతుంది
పాన్‌షాపుల ముందు ఎర్రమరకల్లో సాయంత్రం
జారి పోతుంది
గుడిమెట్లమీదుగా చీకటి దిగివస్తుంది

చీకటి పడితే
చిరుగులు కనిపించవనే సంతోషం తప్ప
నిద్ర పడితే
కలలు మేల్కొంటాయనే ఆనందంతప్ప-మరేముంది?

కలలో అమ్మ!
మసకగా మలినంగా
నీరసంగా జ్వరంగా అమ్మ
అమ్మ గొంతుచుట్టూ బలిసిన వేళ్ళు
ఆ గొంతులో స్పృహ తప్పిన కేకలు
కల భయంతో వణికిపోతుంది
అమ్మ ఆఖరి శ్వాసగా మారినట్లు గాలి స్తంభిస్తుంది
ఎక్కడో ఒక మూగ చుక్క నిస్సహాయ ప్రేమతో
స్పందిస్తుంది

ఏడుపు దిగమింగుకొని
వెలుతురు కోసం వెతుక్కుంటూ బయలుదేరుతుంది
అనాథ బాల్యం

—అమ్మంగి వేణుగోపాల్

ఎవరైనా రాత్రి మన కల్లోకొస్తే ఉదయాన్నే వాళ్ళని చూడ ం సరదాగా వుంటుంది. ప్రత్యేకమైన కల్లోకొస్తే వాళ్ళ దర్శనం మరీ ప్రత్యేకంగా ఉంటుంది.

వెంకట్రావుసహజంగా సాయంత్రాలుతప్ప పైకిరాడు. ఇవ్వాళేదో అర్జంటుపనుండివచ్చాడు. చేతిలో గట్టిగా చుట్టబడిన కాగితాలమధ్య "బొమ్మల పుస్తకం"వుంది. తిరిగివ్వటానికొచ్చాడు.




కాగితాలపొత్తి భాస్కరానికప్పగిస్తూ సంతృప్తికరమైన నవ్వొకటి సారించాడు

"రాత్రేమిటి, చాలా అఘాయిత్యం చేసినట్లున్నారు" తనకుమాత్రం అర్థమయ్యే శ్లేషలో భాస్కరం.

"పోదురూ. మీరు ఎప్పుడూ అలాగే అంటారు. రాత్రేం కొత్తపనులుచేయలేదు."

"చేసేవుంటార్లెండి.చెబుదురూ, మీ మిసెస్ చూసారా?"

తలూపాడు వెంకట్రావు.

"ఏమన్నారు?"

"పుస్తకం తిరిగివ్వొద్దంటుందండి. నేనే బాగుండదని తెచ్చేసాను"

"పోనీ ఉంచుకోపోయారా"

"వద్దండి. పిల్లః చూస్తే బాగుండదు."

భాస్కరానికి పిల్లలనగానే ఆ సంఘటన గుర్తొచ్చింది. చెబుదామనుకున్నాడుకాని, అనవసరమని ఊరుకున్నాడు.

వెంకట్రావు "ఏమండీ ఇలాంటివిచూస్తే కుర్రవాళ్ల పాడైపోరండీ?"

"మీరు కుర్రవాళ్ళా" భాస్కరం సూటిగా.

"అంటే పెళ్ళయినవాళ్ళసంగతి వదిలేయండి. కాని వాళ్ళండి" వెంకట్రావు సిన్సియర్‌గానే అడిగాడు.

"పాడవుతారు" నిశ్చయంగా అన్నాడు.

"మరి అలాంటివి అచ్చువేయటం దేనికండీ?"



భాస్కరం సీరియస్ అయ్యారు.

'అమ్మ వేయటం వాళ్ళ వ్యాపారం. బొమ్మల్లో నటించిన వాళ్ళు కేవలం కూలివనిగా మాత్రం నటిస్తారు... పోనీయండి... అది వాళ్ళ బ్రతుకు....'

మరి కొని చూసే వాళ్ళది తప్పుకాదంటారా....'

'ఎలా అవుతుంది....ఉప్పూకారం తినే ఈ దేశంలో ఇరవై అయిదేళ్ళ వరకూ కుర్రాళ్ళకు ఆడగాలి సోకనివ్వం.... ఆడామగా వెంటనడిస్తేనే దారుణం జరిగిపోతున్నట్లు భావిస్తాం.

రక్తం వరవళ్ళు తొక్కే విద్యార్థులూ, యువకులూ- రోడ్డు మీద గజానికో నగ్నచిత్రం చూస్తూ ఎలా బ్రతుకుతారండి....బొడ్డుకు జానెడు క్రిందకు బట్టకట్టి. గుడ్డపీలిక అడ్డంగా పెడితే ఏమనుకుంటారు కుర్రవాళ్ళు.... వాళ్ళు మనుషులా లేక త్రేతాయుగంలో....వాళ్ళ....

పెళ్ళయి. పునస్సంధానాలకి ముహూర్తాల కోసం ఆగుతారా.... గుడ్డపీలిక చీల్చి అవతల పారేస్తారా....చెప్పండి....

'నిజమండి..' భాస్కరానికి దణ్ణం పెట్టాలనిపించింది వెంకట్రావుకి....

'సినిమాలూ, వారపత్రికలూ, గోడమీద బొమ్మలూ, క్యాలెండర్లూ, క్లబ్బులూ..కేబరేలు....ఏమిటో వాళ్ళకు తెలియవా.... ఏంచేస్తారు చెప్పండి....

వాళ్ళకు ఇరవైనాలుగ్గంటలూ ఇదే యావకాక మరో ఆలోచనెలావస్తుంది....

ధీరులూ, శూరులూ అవ్వాలంటే ఎలా అవుతారు.. త్యాగం చెయ్యమంటే ఎందుకు చేస్తారు.... గొప్ప భావాలెలా వస్తాయి.. కోర్కెలున్న ప్రతివాడికీ. చావంటే భయం ఉంటుంది.. స్త్రీని జయించట మేమిటండీ నాన్సెన్స్.... స్త్రీ ఏమిటో పురుషుడేమిటో కలిసేం చేయగలరో, అంత గొప్ప రహస్యమేమిటో తెల్చుకోనివ్వండి.. గుప్పెడు తెరిచిన మరుక్షణం ఏముంటుందక్కడ.... గుడ్డపీలిక రహస్యాల్ని దాస్తుందా.... కంటిముందు పిచ్చికా, ఉచ్చ్రాతుకు పశువూ... గదుల్లో అక్కాదావలూ....అత్తమావలూ....వీళ్ళా కాపాడగల్గేది ఈ రహస్యాల్ని. అసలది రహస్యమా.? ఒకరు కాపాడాలా.?

పాలుత్రాగే చంటిగుడ్డునుండీ., స్త్రీహత్యలు చేసిన రామన్ రాఘవ్‌లవరకూ, అందరూ ఒకటే. మనిషి అన్ని మానసిక వర్తనాలకూ ఆద్యం- అధిష్ఠానం. ఈ సెక్స్ అని చెబుతాదండీ సైన్సు.

'జగత్‌యోనిః' అంటుందండీ మతం. ఇహచెప్పండి.. ఉచ్ఛమేమిటో, నీచమేమిటో.'

సంగీతంవింటున్న పసిపాపలా ఉన్నాడు వెంకట్రావు. కుంటివాణ్ణి అంతరిక్ష యానానికి తీసుకుపోయినట్లుందతనికి 'కొంత తెలిసిందండి. తెలియందేమిటో కూడా తెలిసిపోయింది.' అన్న అవస్థలో ఉన్నాడు.

ఏదో అడగబోయాడుకాని ఇంత విన్నతర్వాత ప్రశ్న వేయటానికే సిగ్గనిపించింది.

ఎందుకో సరోజ గదిలోకొచ్చింది.

ఒకేసారి ముగ్గురూ చూసుకున్నారు. సరోజ 'రాగూడని చోటకొచ్చినట్లు' వెంటనే స్టాండ్‌మీద టవల్ తీసుకుని వెళ్ళిపోయింది.

'ఆఫీసుకుటైమవుతుందేమో మీకు.'వెంకట్రావులేచాడు.

భాస్కరం తన గురుత్వానికి స్వస్తిచెప్పి.

'మీరు జూపినట్లు సరోజకు చెబుతాన్లెండి. అన్నాడు తమాషాగా.

వెంకట్రావు రెండుచేతుల్తో నమస్కారంపెట్టి గబగబా మేడ దిగాడు'

భాస్కరం స్నానం చేయటానికి బయటకు నడిచాడు. తన ఉపన్యాసానికి వేడెక్కిన తన శరీరం మీద చన్నీళ్ళు కుమ్మరించుకున్నాడు.

## 14

ఇద్దరూ ఆఫీసుకు బయలుదేరారు. రాత్రి సరోజ ఏం నిర్ణయించుకుందో కాని, ఉదయాన్నే ఏం తెలియనట్లు పనులు చేసివేసింది. ముభావంగా ఉంటూనే.

భాస్కరం బయలుదేరి బూట్లు తొడుక్కుంటూ కాఫీ యిచ్చిన సరోజతో 'రెండింటికి లీలామహల్ కొస్తావా- సినిమాకు పోదాం' అన్నాడు.

'ఆఁ- అలాగే' సరోజ।

'ఇవ్వాళ జీపలో డ్రాప్ చేస్తాను పద.'

'ఎందుకూ బస్సులో వెళ్తాన్లెండి.' అనాలని అనిపించ లేదు. ఒప్పేసుకుంది.

అప్పుతెచ్చినా, అడుక్కుని తెచ్చినా ఆడదానికి ప్రేమ కావాలంతే. ప్రేమకోసం వీలుతప్పితే ప్రేమనైనా త్యాగం చేయగలదు।

మగవాడికి ప్రేమకావాలి. అందు కోసం అవగింజకూడా త్యాగం చేయడు.।

నిజానికి మగవాడనే వాడే సిసలైన 'రాస్కెల్' వీడి 'రాస్కాలిటీ'ని తెలుసుకోవటానికి ప్రయత్నంకూడా చెయ్యక తెలిసిపోయిందనుకోవటం స్త్రీమూర్తుల తరతరాల అజ్ఞానం.

ఇద్దరూ జీపెక్కారు.... జీపులో మొగుడు ప్రక్క కూర్చుంటే సరోజకు ఏడుగుర్రాల బండెక్కినట్లుంది. భాస్కరానికి జ్యోతే ప్రక్కనున్నట్లుంది। ఒకరి భుజాలొరికకి తగుల్తుంటే ఇద్దరికి కొత్తగా పెళ్ళయినట్లుంది।

సరోజ ఆఫీసు దగ్గర జీపు ఆగింది. దిగబోయేసరోజకు



పేపర్లో చుట్టబడిన ఓ పుస్తకం యిచ్చాడు- 'చూడు' అంటూ.

'ఏమిటిది?'

'ఇంగ్లీషుపుస్తకం. వెంకట్రావు చూసివిన్ననేయిచ్చాడు. ఇందిర కూడా నచ్చిందట. ఎవరికీ యివ్వకు జాగ్రత్త' ఒక్క మాట వది అర్థాలు యిచ్చేటట్లు పలికాడు భాస్కరం. జీపు కదిలింది.

సరోజ ఆఫీసులోకి నడిచింది. 'ఏమిటాయిది' అనుకుంటూ.

## 15

సంతకం చేసిన సరోజ తన ఆఫీసరుగార్కి 'గుడ్ మార్నింగ్' చెప్పింది. ఆయనోముసిలాయన, ఆడవాళ్ళంటే గిట్టదో, ఏమో పాపం కన్నెత్తి కూడా చూడదు. లేక అన్ని దశ లూముగించి వానప్రస్థంలోకి చేరాడు.

సడన్‌గా సరోజకు 'జ్యోతి అదృష్టవంతురాలు' అనిపించింది. ఇంచక్కా ఆఫీసరు, తననెంతో యిష్టంగా చూస్తాడు. మంచి కాలక్షేపం. పోనీ భాస్కరం ఆఫీసులోకి తనుకూడా మార్పించుకుంటే అని ఓక్షణం ఆగి వద్దు బాబు- ఆఫీసులో కూడా మొగుడెదురుగ్గా అనుకుంది.

దీనికి బలాన్ని చేకూర్చేటట్లుగా జీపుప్రయాణం గుర్తొచ్చింది. స్వంతభర్తతోనే ప్రయాణంచేసినా ఎంత కొత్తగా అనిపించింది కారణమేమిటో? కారణం తనకు. తెలుసు ఏమిటో....

అన్నట్లు పుస్తక మేమిటో చూద్దామనుకుంటుండగా ఫ్యాన్‌వచ్చి 'అమ్మగారు తమకుఫోను' అని పిలిచాడు.'తనకు ఫోనా.... ఎవరబ్బా....ఇప్పుడేగా ఆయనవెళ్ళింది.అనుకుంటూ ఫోను రూములోకి వెళ్ళింది. రిసీవర్ ప్రక్కన పెట్టివుంది. అందుకుని 'హలో....' అంది ఆతృతగా....

'హలో సరోజగారాండి' స్థిమితంగా వుందవతలిగొంతు.

'అవును'.

'నేనండీ వెంకట్రావును.'

సరోజ కొక్కసారిగా తన గుండెదడ వినిపించింది. ఇదేమిటి ఇతను ఫోను చేస్తున్నాడు.

ఆఁ ఏమిటి-' తన ఊపిరి బలవంతంగా సాగుతుంది.

గొంతు పెగలటంలేదు.

'ఊరికేనండి.'

'ఊరికేనా' అని కాసేపాగి ఊరికే ఎందుకూఅనేసింది.'

'మీరు ప్రొద్దున్న చూసినప్పుడు అదోలా వున్నారు.'

'ఎలా వున్నారు? మామూలుగానే వున్నానే.' ఏదో మాట్లాడుతుంది. తనకే తెలియటంలేదు. ఫోన్ పెట్టేద్దామనిపించింది. పెట్టేయ-బుద్దేయలేదు.

'ఉత్తరం చదివారా అండి.'

సరోజకూడా ధైర్యం వచ్చింది,

'ఎందుకలా రాసారు.'

అతగాడి గొంతులో రాయిపడింది. బలవంతాన మింగి. కోపమొచ్చిందా అండి. భాస్కరంగారు చూసారా.'

ఏమిచెప్పాలో తెలియలేదు సరోజకు. నిజం చెప్పాలో.

అబద్ధం చెప్పాలో అన్న మీమాంసంలో పడింది.
చూశ్శేదు
పాపం అవతలి గొంతుక విమానంలోంచి జారిపడి ఇంకా ఊపిరితో ఉన్నట్టుగా.
'చించివేసారా',
'లేదు.'
'చించివేయండి'
'______________'
సారీ అండి. పొరపాటయింది. మీరు బాధవద్దారేమో అని చాలా భయంవేసింది. హలో.?
'______ అ(______'
'విసుగ్గా వుందాండి.'
'లేదు.'
'ఆ రోజు ఆవేశంలో అలా చేశాను.మీకుకోపం వచ్చిందేమోనని. చెప్పిన మాటలే చెప్తున్నాడు.
'ఉత్తర మెందుకు రాయటం.?'
'తొందరపడ్డానండి. Excuse me. భాస్కరంగారికి చెపుతారా?'
'చెప్పన్లెండి!!!++??'
'Thanks అండి. ఉంటానండి.'
'ఊఁ' ఫోను పెట్టేసింది. సరోజ గుండెమీద బరువు దించినట్లయింది. తనేం నేరం చేయకపోయినా ఏమిటీ ఇంత రిలీఫ్‌గా వుందనిపించింది. నేరం అతను ఒప్పుకున్నాడనా.లేదే. పైగా భాస్కరానికి చెప్పొద్దంటున్నాడు.అక్కడకు తాను ఆప్తుడైనట్లూ భాస్కరం కానట్లూ.
'ఆయనకు చెప్పనని ఎందుకన్నాను. ఓదార్పా నేమిటి. ఏదో అయిపోయిందిగా....ప్రాణం తేలికపడింది. ఇప్పుడు కనపడినా మాట్లాడొచ్చు. తాను జవాబివ్వవలసిన పనిలేదిప్పుడు! ఫ్రీగా సీటువైపు నడిచింది.
సీటులో తాపీగా కూర్చుని పుస్తకం తెరిచింది. చేతిలో అణుబాంబు పేలింది. ఫోనులో మాట్లాడినందుకు శిక్షగావరీక్షగా.
మూసివేసింది....ఆఫీసంతా పగలబడి నవ్వుతూ తనకేసి చూస్తున్నట్లనిపించింది! అరగంట తర్వాత ఎవరూ చూడటం లేదని తెలిసి మళ్ళీ చేతులు పుస్తకం మీదికెళ్ళాయి.
టేబిల్ డెస్కులో పెట్టి పేజీలు తిప్ప నారంభించింది....


## 16

మధ్యాహ్నం ఒంటిగంట ఎప్పుడవుతుందా అని చూస్తోంది జ్యోతి. కాలం కదలటంలేదు. సినిమా హాల్లో మూడు గంటలకూ, పరీక్ష హాల్లో మూడు గంటలకూ ఎంత తేడా!
తన గదిలో గడియారానికీ, భాస్కరంగారి గదిలో గడియారానికీ ఎంత వ్యత్యాసం....!
యుగాలూ, మన్వంతరాలూ నిద్రలో ఉంటారట దేవుళ్ళు....!
ఎదురుగా ఆఫీసర్ల నుంచుకుంటూ కాబోలు! శాస్త్రి జ్యోతి చెవిలో వంగి...
'జ్యోతీ, ఏమన్నారు భాస్కరంగారు?' జ్యోతి ఏం తెలియనట్లు.

'ఏ సంగతి....నన్ను పెళ్ళి చేసుకునే సంగతా?' దెప్పిపొడిచింది....
'అదే అనొద్దన్నాను.... ఎవరో అప్రాచ్యుడు పుట్టిస్తే నన్నుకూడా అనుమానిస్తున్నావ్.'
జ్యోతి ట్విస్టుకొట్టి చూద్దామని....
'అప్రాచ్యు దేమిటి.... నిజంగా ఆయన రిజిష్టర్ మేరేజ్ చేసుకుందామంటుంటే.... మీ కిష్టం లేకపోతే చెప్పండి.'
'అబ్బెబ్బె ....నిజంగా అలా అయితే ఎవరడ్డంవస్తాడో రమ్మను. సాక్షి సంతకం నేను పెడతాను. ఇలాంటివి ఈ రోజుల్లో లక్షలు జరుగుతున్నాయి.'
'మీకా శ్రమ వద్దులెండి. ఆయన నన్ను చేసుకోవటమేమిటి. లక్షణంగా భార్య వుంటే?'
'వుందనుకో. అవసవ్యంగా వుందనే నేనూ యోచిస్తున్నాను.'
'నాకు చేసుకోవాలనే వుందండి.'
'మరింకే.... కానియ్.... నేను మాట్లాడిరానా!'
'ఆయన ఒప్పుకోవటంలేదు. సరేమిరా పెళ్ళి వీల్లేదంటున్నాడు.'
'అలా అయితే కష్టమేనే.పోనీ యథాతథస్థితి కంటిన్యూ చేస్తేపోలా.'
'సాక్షి సంతకాల వాళ్ళమీద సరోజగారు దావావేస్తే.'
'దావానే....పోనీ....గుళ్ళో....' శాస్త్రిని ఫుట్‌బాల్ బంతిగా ఆడుకుంది జ్యోతి. 'గోల్' చేరుకునేందుకు ఇన్నికాళ్ళ తన్నులు భరిస్తున్నాడు. తన వయస్సును కూడా నట్టేట్లో పారేసి అటూ యిటూ గెంతుతున్నాడు.!
కాసేపటికి తేరుకుని....
'ఇంతకీ చెప్పావు కావు....' శాస్త్రి!
'ఓహో, మీ ప్రమోషన్ సంగతా, మీకివ్వక నా కిస్తారేమిటి ప్రమోషన్. మీరు సీనియర్లు.'
'అబ్బ మెరిట్ లిస్టులో నువ్వు తప్పకుండా ఉంటావు జ్యోతీ. ఓసారి అడిగి చూడు. నీకు రాకపోతే నా మెడ తెగ్గోసుకుంటాను'
జ్యోతి ఇక బాధ భరించలేక.
'అలాగే. అందర్నీ వెళ్ళనివ్వండి అడుగుతాను.'
'మామంచిదానివికదూ.అసలు జ్యోతీ, ముఖస్తుతిక్రింద భావిస్తావుకాని- నీ కళ్ళలో తేజస్సు అనితరసాధ్యం సుమా'
'చాలు చాలు మీపని చూడండి.'
'ఇదిగో అవశ్యం.ఆహ్వాన్‌గాణ్ణికూడా ఎటన్నా పంపించేయనా'
'అదేమిటి- మేమేమన్నా లవ్‌సీన్లు వేయబోతున్నామనుకున్నారా?'
'సర్లే సర్లే నీమనస్సు బాగోలేదు నీ యిష్టం.'
శాస్త్రి బయటకు పోయాడు.

*   *   *

ఎట్టకేలకు ఆఫీసు గడియారం ఒంటి గంట కొట్టింది.




ఆఫీ సు దాదాపు ఖాళీ అయింది. ప్యూన్ అప్పారావుతో శాస్త్రి, 'ఎటన్నా తగలడ్రా బాబూ ఇవ్వాళ జ్యోతికి ఆఫీ సరు గారితో 'అర్జంటు పనుంది.'

నేనేం చేసానండి. బయటే చస్తాగ' అప్పారావు।

'నువ్వు బయట చచ్చినా, లోనకు ఎప్పుడు చస్తావో నన్న బెంగఉంటేచాలు....వాళ్ళకు అన్యోన్యత తగలడదు, నా పని అవ్వదు.' అంటూ అప్పారావు చేతిలో అయిదు రూపా యల నోటుంచాడు.

అప్పారావు 'నాదేం బోయింది ఓరివాడ తస్సగొయ్య. పని ఎగ్గొట్టి ఎల్లిపొమ్మని ఒకరికి పోటీగా ఒకరు డబ్బు లిస్తన్నారు' అనుకుంటూ వెళ్ళిపోయాడు.

శాస్త్రి జ్యోతివంక చివరి చిరునవ్వు నవ్వి వీడ్కోలు తీసుకున్నాడు.

* * *

గోడగడియారం తప్ప మరేదీ చప్పుడు చే యటంలేదు.

టైపు మిషన్లు విశ్రాంతి తీసుకుంటున్నాయి. కుర్చీలు ఊపిరి పీల్చుకుంటున్నాయి. ప్రశాంతంగా ఉంది వాతావరణం

జ్యోతి భాస్కరం రూమ్‌లో కొచ్చింది! భాస్కరం కళ్ళతో పలకరించి. ప్రక్కనున్న స్టూల్‌మీద కాళ్ళు పెట్టి నడుం జార్చాడు.

'ఉత్తరం ఏమయింది?' జ్యోతి తన కుర్చీ అతని ప్రక్కనే వేసుకుంటూ.

ఆమెతోపాటు అప్పుడే దట్టించిన ఆమె శరీరం సువా సనలుకూడా వచ్చాయి. కడిగిన ముత్యంలా వుంది మనిషి.

బొద్దుగా, ముద్దుగా ఉన్న విగ్రహం ముచ్చటయిన పసుపు- ఎరుపూ రంగుల చీరె! చీరకంటే పొడవుగా పాదా లను తాకుతూ కనిపిస్తున్న లేత పసుపు 'పెటీకోట్'! కదిలే కళ్ళు.. కదిపే పెదవులు. 'ఒంటరిగా ఈ పిల్లను ఎలా బ్రతక నిచ్చింది లోకం' అనిపించిందతనికి.

అందం రెండు రకాలు. బాపు బొమ్మలూ.. వడ్డాది పాపయ్య బొమ్మలూ అని. పెళ్ళికి బాపూ బొమ్మలు బావుం టారు. ప్రణయానికి వ. పా. గుమ్మలు బావుంటారు,

(బాపూ బొమ్మలపేర్లు- లత- వనజ.. సరళ.... వ.పా. బొమ్మలపేర్లు. మృణాళిని- వాసంతిక- శరచ్చంద్రిక. లావు లావుగా)

జ్యోతి రెండోరకం బొమ్మ! జ్యోతికంటే సరోజ బావుం టుంది.(పోటీలో భాస్కరం జడ్జీగా వుండకుంటే.) సరోజ కంటే ఇందిర బావుంటుంది. (వెంకట్రావును తీసివేయండి.) ఇందిరకంటే సినిమాతార జయప్రద బావుంటుంది. (ఎవర్ని తీసివేయాలో!?) జ్యోతి సంభాషణలోకి లాగుతూ.

'సరోజగారు చదివారా'

'చదివారు'

'ఎపుడు'

'రాత్రి పదింటికి'

'రసపట్టులో నేమిటి?'

'రసభంగంకూడా అయ్యింది'

'ఏమంది?'

'ఎమందీ- నన్ను చచ్చేటట్లు తిట్టింది.'

'చూసారా- చూసారా- వద్దన్నా వినకుండా నా చేత రాయించారు మీరూ మీరూ ఆలుమగలు కలహాలొస్తాయి. కల యికలొస్తాయి. మధ్యలోనన్ను తిట్టిస్తారా. రేపుమళ్ళీ ఆమె ముఖం చూసేదెలా.'

"డోంట్‌వర్రీ జ్యోతి, ఇకనుంచి నువ్వుకనపడితే ఇంకా సాధారణంగా మాట్లాడుతుంది చూడు."

"అంతమాత్రాన వెంకట్రావుతనకు ప్రేమలేఖ రాసినట్లు ఒప్పుకుందా... ?"

ఒప్పుకోలేదు. అక్కడే వుంది గమ్మత్తు. గట్టిగానొక్కే సరికి ఏడ్చేసింది....'

"ఏడిపిస్తారాపాపం. అక్కడకు మీరేదో పవిత్రులైనట్లు

"పొరపడ్డావు డియర్, ఆ సంగతి నాకు తెలిసినందుకు కాదు ఏడుస్తు. దాచాననుకున్న ఆత్మాభిమానం దాచలేక పోయినందుకు."

"అయినా ఆ వెంకట్రావు ఏవిటీ. ఇంత మొగుడున్న సరోజాగార్కి రాయకపోతే నాకు రాయకూడదూ." జ్యోతి చిలిపిగా.

"యూ,స్టుపిడ్," భాస్కరం జ్యోతి నెత్తిమీదకొట్టాడు.

"అబ్బ"- అంది- దెబ్బతగిలినట్లు.

"అన్నట్లు జ్యోతిర్మయీ."

"అబ్బో- అంతపేరొద్దులెండి."

"పోనీ జ్యోతిలక్ష్మి."

చూడండీ.... ఎన్నిమాటలంటున్నారో గారాం పోయింది జ్యోతి.

"పోనీ నా జ్యోతీ,"

"ఇప్పుడు బాగుంది. మళ్ళీ అనండి."

"వింటావాలేదా.... నినొన్న రెండు ప్రశ్నలు వేస్తాను.

సమాధానం చెబుతావా."

"తప్పకుండా చెబుతాను." జ్యోతి చేతులు టేబుల్ మీదపెట్టి. చేతులమధ్య ముఖంవుంచి ఈజీగా మాట్లాడుతుంది.

"ఎలాంటి ప్రశ్నలైనాసరే."

"ఎలాంటివైనా సరే" చాలా ఉత్సాహంగా అంది.

"అయితే అడుగుతున్నాను. సిద్ధంగావుండు" భాస్కరం కాళ్ళుముడిచి కుర్చీలో సరిగ్గా కూర్చున్నాడు. 'ఒకటి' "అలాంటి ఉత్తరం నీకొస్తే నీవు సంతోషిస్తావా. లేదా?"

"ఓస్- పిచ్చిప్రశ్న! మీరు రాయమన్నట్లు మీకుప్రేమ లేఖ రాస్తేనే నాకు నిద్ర పట్టలేదు. ఇక మీరు రాస్తే సంతోషించనూ అది పెద్దప్రశ్నేనిటి." సునాయాసంగా చెప్పింది.

"ఆ- ఆ తొందరపడకు.... రెండో ప్రశ్నవిను."

కళ్ళుసగం మూసి చూస్తోంది.... అతనివంక.... ఇష్టమైనవాళ్ళు మాట్లాడుతున్నప్పుడు సరదాగా వుంటుంది. వాళ్ళ పెదాలకేసి చూస్తూవుండొచ్చు


"చెప్పండి"

"వింటావుగా"

"అబ్బ- చెబుదురూ"

"______- వెన్నెల రాత్రి....చల్లని గాలి.... మేడ మీద పరుపు.... పరుపుమీద నీవూ. నేనూ....

నిన్ను నగ్నంగాచేసి నాదగ్గరగా తీసుకుని 'ఈ క్షణంలో నీకేం కావాలి' అంటే ఏమంటావ్?'




జ్యోతి ముఖం కందగడ్డయింది. ప్రక్కకు తిరిగింది కళ్ళు బరువెక్కాయి. పెదాలు వణికాయి. చెప్పాలనివుంది. చెప్పలేకపోయింది. సిగ్గువిడిచి తను చెప్పినా ఆయన అంగీకరిస్తాడా. ఆయన అంగీకరించేవాడే అయితే....ఎప్పుడో తనను అపహరించేవాడు. దానిసను చేసుకునేవాడు.

*With best compliments from*

**Telegrams: "TWINKLE"** **Telephones: 37 & 441**

# EAST INDIA COMMERCIAL Co. (PRIVATE) LTD.

**Lessee: SRI KRISHNA JUTE MILLS, ELURU - 534 002. (A. P.)**

Manufacturers of all varieties of Jute Gunny Bags including D. W. Flour Bags, Cement Bags, B. Twill Bags and A. Twill Bags and manufacturers of 'KRISHNA' Brand Jute Twine in all plys and jute yarn in Spools & Cops.




తనకు కూడా గౌరవమిస్తున్నప్పుడే తెలిసింది.... ఆయన కావలసింది వేరని. ఆయనకు వెలుగు తప్ప చీకటి అవసరం లేదని. ఈ ప్రశ్నలు ఏ కథకో కేవలం సమాధానాలు.

ఆయన మాటలకు రూపం తప్ప ప్రాణం లేదు. అలాంటప్పుడు సమాధానం చెప్పి ఏం ప్రయోజనం?

"చెప్పవేం జ్యోతి, అలా అయిపోయావేమిటి? నీకు కూడా మొహమాటాలున్నాయా"

జ్యోతి వెనక్కు తిరిగింది.... నీకు కూడా అనే మాట బాధించింది. నేను కేవలం బొమ్మనా అనిపించింది.

"లేవు -కాని చెబితే ఏమిస్తారు" సరైన ప్రశ్న తిరిగి వేసింది.

"అదీ—అదీ ఇయ్యటం కాదు జ్యోతీ అసలు చెప్పు జ్యోతీ చూద్దాం."

జ్యోతి కళ్ళు పెద్దవి చేసి, కుర్చీలో ముందుకు వంగి, దగ్గరకు జరుగుతూ "అడగండి ప్రశ్న" అంది....

ఈ క్షణంలో నీకేం కావాలి?" భాస్కరం మాటల్లో శక్తి తగ్గిపోతుంది....

"ఏ క్షణంలో—" జ్యోతి రెట్టించింది.

"అదే ఆ క్షణంలో—"

"ఆ క్షణంలో ఏం కావాలో ఇప్పుడెలా చెప్పగలను? నన్నా క్షణానికి తీసుకుపోండి చెబుతాను అని గొంతు తగ్గించి. "ఈ క్షణంలో మాత్రం మీ ఒళ్ళో పడుకుని ఏడవాలనుంది.' భాస్కరం నగం గడ్డకట్టిపోయాడు.

'ఊరికే చెప్పలేవా?'

"ఊరికే చెప్పటానికి మనిషినా- మాటలు నేర్చిన చిలకనా చెప్పండి."

భాస్కరానికి కవితావేశం తగ్గిపోయింది. కవిత్వం జీవితానికి చేరువగా రాలేకపోయింది. అనుభవం జీవితంలో మంచి తప్ప ప్రయోగం మీద రాదని తెలిసిపోయింది.

జ్యోతివంక చూసి, "జ్యోతీ" ఈ రెండు వేళ్ళలో ఒకటి పట్టుకో. ఎందుకు అని ఆలోచించకుండా ఒకవేలు పట్టుకుంది. పట్టుకున్న చేతిని గట్టిగా నొక్కి, భాస్కరం,

"అంటే మనది పొడుగు ప్రేమన్న మాట."

"అంటే" జ్యోతి!

"అవును జ్యోతి.... ఈ ప్రశ్నకు సమాధానం నువ్వు యివ్వలేని మాట నిజం.... అందుకని ప్రశ్నే మార్చుకుంటున్నాను.... నీ మాటలు వింటూ, నీ కళ్ళలోకి చూస్తూ.... పరమార్థం వెతుక్కుంటూ నేను నీ ముందు ప్రతిరోజూ ఉంటే చాలదూ.... అప్పుడు "నీకేం కావాలి" అని ప్రతిరోజూ అడుగుతాను.... ఏం చెబుతావ్...."

జ్యోతి అంతా అర్థమైనట్లు 'రోజూ శనివారం కావాలంటాను—మీరేమంటారు.'

పక్కన నవ్విన భాస్కరం.. జ్యోతిని టేబుల్ మీదకు లాగి ముద్దు పెట్టుకున్నాడు! జ్యోతి ఒళ్ళంతా వణికిపోయింది.. లేచి తన గదిలోకి వెళ్ళిపోయింది.

భాస్కరం ఆమె వెళ్ళిన వేపే చూస్తున్నాడు..

ఫోన్ 'గయ్' మని మ్రోగింది. మాట కలిసిపోయింది భాస్కరం ఫోన్ ఎత్తాడు.! హలో!'

'నేనండీ-సరోజను.'

'హల్లో సరోజా- వస్తున్నాను.'

'ఎక్కడికి.'

'ఎక్కడికేమిటి-సినిమాహాలుకి.'

'వద్దు. ఇంటికి పోదాం.'

'ఏం.'

'అదంతే. ఇంట్లోనే ఇంగ్లీషు సినిమా'

సినిమానా ఏమిటది.

'నైన్‌టీన్- ఫైవ్- ట్వెంటీఫోర్ అని సస్పెన్స్.'

'ఓ యబ్బో-మరి నా జవాబులో.' 'ఏం'నేనే మీకెందుకు చెప్పాలి.. నేను రెండు ప్రశ్నలడుగుతాను.. మీరే చెప్పండి. జవాబులు..' రాటు తేలిన గొంతుతో ... 'అడుగుచూద్దాం'

' ఒకటి.. నోరు మెదపలేని పిరికివాళ్ళకు దొంగ ఉపన్యాసాలిచ్చి ప్రక్కింటావిడకు ప్రేమలేఖలు రాసే స్థితికి తీసుకురావొచ్చునా?'

భాస్కరానికి చెంపదెబ్బ కొట్టినట్టయింది..

'వింటున్నారా....రెండోది....చెప్పినట్లు ప్రేమలేఖలు ఆఫీసు ఉత్తరాల్లా రాసే ఆడవాళ్ళున్నారా....?'

భాస్కరం కళ్ళు తిరిగి పడబోయాడు.. 'ఏమండీ మాట్లాడరేం.. కొంప దీసి రెండో ప్రశ్నకు జవాబు కూడా ఆమె చేత రాయించటంలేదు కదా....'

'అయాం సారీ సరోజా.. నిన్న రాత్రి బాగా హర్ట్ చేసానుకదూ..

ప్రశ్నలు-ప్రశ్నలు చెల్లు.. ఇంటి కొచ్చేస్తున్నాను...'

'మంచిది.. తాళాలు వెయ్యమని జ్యోతికి చెప్పిరండి..'

'యూ, ఫూల్..' అన్నాడు.. సరోజ నవ్వి..

థాంక్స్ టు యువర్ సీ బుక్.. ఇంటికి రండి, చెబుతాను.' ఫోన్ పెట్టేసింది...

(సమాప్తం)